Website: www.subhatelangana.in

RNI-TELTEL/2017/72695

గురువారం
17 అక్టోబర్ 2024

ఎడిటర్:
నాగళ్ళ చంద్రశేఖర్

సంపుటి : 8
సంచిక : 160
పేజీలు : 6
వెల : 3/-

# శుభ తెలంగాణ

ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక

మేడ్చల్

Circulated at Hyderabad, Rangareddy, Warangal, Karimnagar, Khammam, Nalgonda, Nizambad, Medak, Adilabad, Mahaboobnagar

### తెలంగాణ ఉన్నత విద్యామండలి

## చైర్మన్‌గా ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి


- వైస్ చైర్మన్‌గా ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం నియామకం
- ఈ మేరకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఉత్తర్వులు
- ఈ నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని ప్రకటన
- కోఠి మహిళా యూనివర్సిటీ ఇంఛార్జి వీసీగా ధనావత్ సూర్య



శుభ తెలంగాణ హైదరాబాద్

తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే వైస్ చైర్మన్‌గా ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తంను నియమించింది. ఈ మేరకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని పేర్కొన్నారు. వీరిద్దరూ ఆయా పదవుల్లో మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. కాగా, ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి ప్రస్తుతం నల్సార్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ఉన్నారు. ఈ రెండు నియామకాలతో పాటు రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాలకు ఇంఛార్జి - మిగతా3లో

# ఒకే దఫాలో..
# కులగణన



- రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి వివరాల సేకరణ..
- 10-15 రోజుల్లో ప్రక్రియ పూర్తి
- మరో 10-15 రోజుల్లో ఆన్‌లైన్‌లో నమోదు
- 54-60 ప్రశ్నలతో సిద్ధమైన ప్రశ్నావళి
- త్వరలో షెడ్యూల్ విడుదల చేయనున్న ప్రభుత్వం
- గణన పూర్తయ్యాక సర్కారుకు కమిషన్ నివేదిక
- బీసీలకు స్థానిక ఎన్నికల్లో కల్పించాల్సిన రిజర్వేషన్లను సూచించనున్న కమిషన్

శుభ తెలంగాణ హైదరాబాద్

రాష్ట్రంలో కులాలు, ఉపకులాల వారీ లెక్క తేల్చేందుకు రంగం సిద్ధమైంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల్లోని కులాలు, వాటి ఉపకులాల వివరాలతోపాటు ఆయా కులాలకు చెందినవారి సామాజిక, రాజకీయ, ఆర్థిక స్థితిగతుల వివరాలనూ ప్రభుత్వం సేకరించనుంది. ఈ మేరకు రాష్ట్రంలో నిర్వహించబోయే కులగణనకు అవసరమైన ప్రొఫార్మాను బీసీ కమిషన్ రూపొందించింది. దాదాపు 54-60 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని సిద్ధం చేసింది. ఇక ఎప్పటి నుంచి కులగణన చేపట్టాలనే షెడ్యూల్‌ను ప్రభుత్వం త్వరలో విడుదల చేయనుంది. షెడ్యూల్ విడుదలయ్యాక రాష్ట్ర వ్యాప్తంగా ఒకే దఫాలో కులగణన చేపట్టి వివరాలను సేకరించనున్నారు. దాదాపు 10-15 రోజుల్లోనే ఈ ప్రక్రియను పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం సుమారు 80 వేల మంది ఎన్యుమరేటర్లు, 10 వేల మంది సూపర్‌వైజర్లు అవసరమవుతారని బీసీ కమిషన్ - మిగతా3లో



## జమ్ముకశ్మీర్‌లో భారీ అగ్నిప్రమాదం


- 68 ఇళ్లు దగ్ధం
- ఇళ్లు కాలిపోవడంతో నివాసితులు రోడ్డు పాలయ్యారు.
- అగ్నిప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన వారికి తాత్కాలిక టెంట్లలో ఆశ్రయం
- బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయంతోపాటు పునరావాసాన్ని కల్పించే చర్యలు

### విమానాలకు బాంబు బెదిరింపులు..

## కీలక నిర్ణయం తీసుకున్న కేంద్రం!

- దేశవ్యాప్తంగా ఉన్న విమానాశ్రయాల నుంచి వచ్చే విమానాల్లో స్కై మార్షల్స్‌ని రెట్టింపు చేయాలని నిర్ణయం
- గడిచిన మూడురోజుల్లో 12 విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి
- ఈ క్రమంలో భద్రతా ఏజెన్సీలు తనిఖీలు నిర్వహించి.. ఫేక్ బెదిరింపులుగా తేల్చారు





## ఏక్‌నాథ్ షిండేనే మహాయుతి సీఎం అభ్యర్థి

- సీఎం ఎవరో సంకేతాలిచ్చిన దేవేంద్ర ఫడ్నవీస్
- "సీఎం అభ్యర్థిని ప్రకటించాల్సిన పని మాకు లేదు
- మా ముఖ్యమంత్రి ఇక్కడే కూర్చున్నారు
- ఎలాగూ అధికారంలోకి రామని తెలిసే సీఎం అభ్యర్థిని ఎంవీఏ ప్రకటించడం లేదు

# ఏపీలో రిపోర్ట్ చేయాల్సిందే

- ఏపీ, తెలంగాణ ఐఏఎస్ అధికారులకు హైకోర్టులో చుక్కెదురు
- తమను రిలీవ్ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని ఐఏఎస్ అధికారుల పిటిషన్
- ముందు మీరు డీవోపీటీ కేటాయించిన రాష్ట్రాల్లో చేరాలని హైకోర్టు ఆదేశం
- మీరు ఎక్కడ పని చేయాలో కేంద్రం నిర్ణయిస్తుందన్న హైకోర్టు
- వాదనలు విని... ఐఏఎస్ అధికారుల పిటిషన్లను కొట్టివేసిన హైకోర్టు

-2లో




# మళ్లీ గ్రామ రెవెన్యూ వ్యవస్థ!

- 10,954 రెవెన్యూ గ్రామాలకు సిబ్బందిని నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు
- ఇప్పటికే ఓసారి నివేదిక ఇచ్చిన సీసీఎల్ఏ
- మరోసారి నివేదిక కోరిన రెవెన్యూ శాఖ
- సిబ్బంది ఎంపిక, హోదా, బాధ్యతలు, విధివిధానాలపై స్పష్టత ఇవ్వాలన్న సర్కారు

శుభ తెలంగాణ హైదరాబాద్

రాష్ట్రంలో గ్రామ స్థాయి రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించాలని సంకల్పించిన ప్రభుత్వం.. ఆ మేరకు కసరత్తు ముమ్మరం చేస్తోంది. దీనిపై అధ్యయనం చేయాల్సిందిగా భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ)కు గతంలోనే సూచించింది. ఈ మేరకు అధ్యయనం చేసిన సీసీఎల్ఏ.. ఒక నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. అయితే ఆ నివేదికలో పేర్కొన్న ప్రతిపాదనలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడంతో దానిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. గ్రామ స్థాయి రెవెన్యూ యంత్రాంగం ఎంపికపై మరోసారి నివేదిక ఇవ్వాల్సిందిగా ప్రభుత్వం తాజాగా సీసీఎల్ఏను కోరింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్.. సీసీఎల్ఏకు లేఖరాశారు. కాగా, సీసీఎల్ఏ తొలుత ఇచ్చిన నివేదికలో.. గతంలో ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక వీఆర్వో, ప్రతి ఆవాసానికి ఒక వీఆర్ఏ పనిచేసేవారని, అంతా కలిపి - మిగతా3లో



# ముఖ్య నేతల కోసమే ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్ మార్చారు

- రీజనల్ రింగ్ రోడ్డు(ట్రిపుల్ ఆర్) దక్షిణ భాగం కేంద్ర ప్రభుత్వం నిర్మించాలి
- కానీ ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని కావాలనే రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తానంటోంది
- రాష్ట్ర ప్రభుత్వమే నిర్మిస్తే ప్రజలపై రూ. 20 వేల కోట్ల భారం పడుతుంది
- ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం 158 కి.మీ. మేర కేంద్రమే నిర్మిస్తోంది.
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



శుభ తెలంగాణ హైదరాబాద్

ముఖ్య నేతల కోసమే ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్ మార్చారు అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని కొంత మంది నేతలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం.. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. రీజినల్ రింగ్ రోడ్డు(ట్రిపుల్ ఆర్) దక్షిణ భాగం కేంద్ర ప్రభుత్వం నిర్మించాలి. కానీ ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని కావాలనే రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తానంటోంది. రాష్ట్ర ప్రభుత్వమే నిర్మిస్తే ప్రజలపై రూ. 20 వేల కోట్ల భారం పడుతుంది. ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం 158 కి.మీ. మేర కేంద్రమే నిర్మిస్తోంది. ఉత్తర భాగం నిర్మాణం కోసం భూసేకరణ ఇంకా ప్రారంభించలేదని హరీశ్‌రావు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి నిధులు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. ప్రతి నియోజకవర్గానికి రూ. 5 కోట్లు ఇస్తామని బడ్జెట్‌లో చెప్పారు. 6 నెలలు అవుతున్నా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. వెంటనే నియోజకవర్గ - మిగతా3లో

# ఏపీలో రిపోర్ట్ చేయాల్సిందే

**హైదరాబాద్ :** తెలంగాణ హైకోర్టులో ఐఏఎస్ అధికారులకు చుక్కెదురైంది. తమను రిలీవ్ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలన్న ఐఏఎస్ పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. డీవోపీటీ కేటాయించిన రాష్ట్రాల్లో ముందు మీరు విధుల్లో చేరాలని అధికారులకు హైకోర్టు సూచించింది. అయితే కేటాయింపునకు సంబంధించి పునఃపరిశీలన చేయాలని డీవోపీటీని ఆదేశించమంటారా? అని అధికారులను అడిగింది. ఇలాంటి అంశాలపై స్టే ఇస్తూ వెళితే కనుక ఎన్నటికీ తేలదని హైకోర్టు వ్యాఖ్యానించింది. మీరంతా బాధ్యతాయుతమైన అధికారులు... ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఉండవద్దని హితవు పలికింది. మీరు ఎక్కడ పని చేయాలో కేంద్రం నిర్ణయిస్తుందని స్పష్టం చేసింది.

ప్రస్తుతం ఉన్న రాష్ట్రాల్లోనే కొనసాగేందుకు ప్రయత్నిస్తున్న ఏపీ, తెలంగాణకు కేటాయించిన క్యాడర్ సివిల్ సర్వీస్ అధికారులకు హైకోర్టులో కూడా ఊరట లభించలేదు. డీవోపీటీ ఆదేశాల మేరకు వెళ్లి కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్టు చేయాలని సూచించింది. మాజీ చీఫ్ సెక్రటరీ సోమేష్ కుమార్ విషయంలో ఇచ్చిన ఉత్తర్వులే వీరి విషయంలోనూ వర్తిస్తాయని కేంద్రం తరపు న్యాయవాది హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే తమ సొంత ప్రాంతాలను తప్పుగా నిర్ధారించినందున తమ క్యాడర్ ను మార్చాలని కోరుతున్నారని అందుకే ముందస్తుగా ఉత్తర్వులపై స్టే



ఇవ్వాలని ఐఏఎస్‌ల తరపు న్యాయవాది కోరారు. అయితే ఐఏఎస్‌లు అయినంత మాత్రాన స్టే ఎలా ఇస్తామని కోర్టు ప్రశ్నించింది. అయితే ఐఏఎస్‌లకు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలిచింది. ఐఏఎస్‌లను ఇప్పటికిప్పుడు రిలీవ్ చేయడం కష్టమని కనీసం పదిహేనురోజుల సమయం ఉండాలని అఫిడవిట్ దాఖలు చేసింది. ట్రిబ్యూనల్ కొట్టేస్తే హైకర్టుకు రావడం సరి కాదని కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్టు చేయాలని ధర్మాసనం స్పష్టం చేసింది. కేటాయించిన రాష్ట్రాలకు వెళ్లి రిపోర్టు చేసిన తర్వాతనే పిటిషన్‌పై విచారణ జరుపుతామన్నారు. సివిల్ సర్వీస్ అధికారులు ఎక్కడ కేటాయిస్తే అక్కడకు వెళ్లి విధి నిర్వహణలో పాల్గొనాలన్నారు. వాదనలు పూర్తయిన తర్వాత తీర్పు ను రిజర్వ్ చేశారు. ఆయా రాష్ట్రాల్లో రిపోర్టు చేసిన తర్వాతనే విచారణ చేస్తామని హైకోర్టు స్పష్టం చేయడంతో కేటాయించిన క్యాడర్ రాష్ట్రానికి వెళ్లి రిపోర్టు చే?యల్సిన తప్పని పరిస్థితి ఐఏఎస్, ఐపీఎస్‌లకు ఏర్పడింది. తెలంగాణ నుంచి ఐఏఎస్‌లు ఏపీ క్యాడర్‌కు వెళ్లాల్సి ఉంది. వారిలో గ్రేటర్ హైదరాబాద్ కమిషనర్ కాట అమ్రపాలి కూడా ఉన్నారు. రోనాల్డ్ రోస్, వాకాటి కరుణ, వాణి ప్రసాద్ ఏపీలో రిపోర్టు చేయాల్సి ఉంది. అలాగే ఏపీ నుంచి గరిమెళ్ల సృజన, శివశంకర్, హరికృష్ణ తెలంగాణలో రిపోర్టు చేయాల్సి ఉంది. రాష్ట్ర విభజన జరిగిన సమయంలో అధికారులను ప్రత్యూష్ సిన్హా కమిటీ విభజించింది. యూపీఎస్సీ రికార్డుల ప్రకారం శాశ్వత నివాసం ఆధారంగా ఏపీ అయితే ఏపీకి..తెలంగాణ అయితే తెలంగాణకు కేటాయించారు. కొంత మంది కాట అమ్రపాలి తమ శాశ్వత అడ్రస్ ను విశాఖగా పేర్కొనడంతో ఆమెను ఏపీకి కేటాయించారు. ఇలాగే ఇతరుల్ని కేటాయించారు. కేటాయింపులపై అప్పట్లో క్యాట్ కు వెళ్లి స్టే ఉత్తర్వులు తెచ్చుకుని తమకు నచ్చిన రాష్ట్రాల్లో కొనసాగుతున్నారు.తెలంగాణ చీఫ్ సెక్రటరీగా పని చేసిన సోమేష్ కమార్ కు కూడా ఏపీ క్యాడరే కేటాయించారు. ఆయనకు కూడా గతంలో కోర్టు వ్యతిరేక తీర్పు ఇచ్చింది. దాంతో ఆయన సీఎస్ పదవి నుంచి వైదొలిగి ఏపీలో రిపోర్టు చేశారు. తర్వాత వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నారు. అదే తీర్పు ప్రస్తుత ఐఏఎస్‌లకూ వర్తిస్తుంది.

# మోదీ దీపావళి గిఫ్ట్

**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు నరేంద్ర మోదీ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఉద్యోగులు, పెన్షనర్లకు దీపావళి కానుకగా 3 శాతం కరవు భత్యాన్ని పెంచుతూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం మూలవేతనంలో 50 శాతం ఉన్న డీఎం 53 శాతానికి చేరుతుంది. ఈ ఏడాది జూలై 1వ తేదీ నుంచి దీన్ని అమలు చేయనున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో 10 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు లబ్ధి చేకూరనుంది.

కాగా, సార్వత్రిక ఎన్నికలకు ముందు మార్చిలో డీఏను 4 శాతం కేంద్రం పెంచింది. అది జనవరి 2024 నుంచి అమల్లోకి వచ్చింది. మూడు నెలల బకాయిలను ప్రభుత్వం చెల్లించింది. ఏటా ప్రభుత్వం రెండుసార్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏను సవరిస్తుంటుంది. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఈ కరవు భత్యాన్ని నిర్ణయిస్తారు. ఆల్ ఇండియా కన్సూమర్ ప్రైస్ ఇండెక్స్ (ఏఐసీపీఐ) ఆధారంగా డీఏ పెంపుదలను లెక్కిస్తారు.

**వారణాసిలో రూ.2,642 కోట్లతో రైల్-రోడ్ బ్రిడ్జి**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర మంత్రివర్గం బుధవారంనాడు మరో కీలక నిర్ణయం తీసుకుంది. వారణాసిలో గంగానదిపై కొత్త రైల్-రోడ్ బ్రిడ్జి నిర్మాణానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. జనసామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుంటే ప్రపంచంలోని అతి పెద్ద వంతెనల్లో ఇదొకటి అవుతుందని క్యాబినెట్ సమావేశానంతరం రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు తెలిపారు.

రూ.2,642 కోట్లతో..

కొత్త రైల్-రోడ్ బ్రిడ్జిని రూ.2,642 కోట్లతో నిర్మించనున్నట్టు అశ్విని వైష్ణవ్ తెలిపారు. "మాల్వీయ బ్రిడ్జి కట్టి 137 ఏళ్లయింది. ఇప్పుడు కొత్త బ్రిడ్జి నిర్మాణం జరపనున్నాం. లోయర్ డెక్‌లో 4 రైల్వే లైన్లు, అప్పర్ డెక్‌పై 6 లేన్ల హైవే ఉంటుంది. ట్రాఫిక్ కెపాసిటీ దృష్ట్యా ప్రపంచంలోనే అతి పెద్ద బ్రిడ్జిలలో ఇదొకటి అవుతుంది" అని మంత్రి తెలిపారు.

కాగా, ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి-చౌందాలి జిల్లాల గుండా కొత్త వంతెన నిర్మాణం జరుగనుందని రైల్వే మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇండియన్ రైల్వేస్‌కు క్రూషియల్ హబ్‌గా వారణాసి రైల్వే స్టేషన్ ఉందని, యాత్రికులు, పర్యాటకులు, స్థానిక జనాభాకు గేట్‌వేగా నిలుస్తోందని పేర్కొంది. పెరుగుతున్న టూరిజం, ఇండస్ట్రియల్ డిమాండ్‌కు అనుగుణంగానే కొత్త రైల్-రోడ్ బ్రిడ్జి నిర్మాణం జరగనుందని తెలిపింది. ఇందువల్ల ఈ ప్రాంత సామాజిక-ఆర్థిక వృద్ధి కూడా పెరుగుతుందని, స్వయం ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని పేర్కొంది. ప్రధాన మంత్రి మోదీ 'న్యూ ఇండియా' విజన్,



'ఆత్మ నిర్భర్ భారత్' విజన్ దిశగా ఇదొక ముందడుగు అని అభివర్ణించింది.

**యూరియేతర ఎరువుల సబ్సిడీకి కేంద్రం ఆమోదం**

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులు, రైతులకు శుభవార్త చెప్పింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 3శాతం డీఏను పెంచనున్నట్లు ప్రకటించింది. 2025-26 రబీలో ఆరు పంటలకు కనీస మద్దతు ధరను కేంద్రం ప్రకటించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం కేంద్ర కేబినెట్ సమావేశమైంది. ఈ సందర్భంగా పలు ప్రతిపాదనలు కేబినెట్ ఆమోదం తెలిపింది. సమావేశం అనంతరం కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ కేబినెట్ నిర్ణయాలను వెల్లడించారు. ఆరుపంటల కనీస మద్దతు ధరను పెంచుతున్నట్లు వెల్లడించింది. గోధుమల కనీస మద్దతు ధరను రూ.2425, బార్లీ మద్దతు ధరను రూ.1,980. మినుములు రూ.5,650, కందులు రూ.6,700, ఆవాలు రూ.5,950, కుసుమల ధరను రూ.5,940 పెంచుతున్నట్లు ప్రకటించింది. అలాగే, రబీలో యూరియేతర ఎరువులకు రూ.24,475 కోట్ల రాయితీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

**ఉద్యోగులకు డీఏ ఎంత పెరుగుతుంది..**

ఒక ఉద్యోగి బేసిక్ వేతనం రూ.18వేలు ఉంటే.. 53శాతం డియర్‌నెస్ అలవెన్స్ ప్రకారం.. సదరు ఉద్యోగి వేతనం ప్రతినెలా దాదాపు రూ.54. వరకు పెరుగుతుంది. ఉద్యోగి బేసిక్ వేతనం రూ.25వేలు నెలకు రూ.750 బెనిఫిట్ లభిస్తుంది. కార్మికుడి మూలవేతనం రూ.35వేలు అయితే నెలకు రూ.1050 అదనంగా చెల్లించనున్నారు. రూ.52వేల బేసిక్ జీతం అందుకుంటే కార్మికులకు.. డీఏ పెంపుతో నెలకు రూ.1,560 అదనంగా ప్రయోజనం పొందుతారు. రూ.లక్ష బేసిక్ వేతనం ఉంటే ఉద్యోగి అకౌంట్‌లో నెలకు రూ.3వేలకుపైగా అదనంగా జమ అవుతుంది. సాధారణంగా డీఏ, డీఆర్ రేట్స్ పెంపు ప్రకటన సెప్టెంబర్‌లో జరుగుతుంది. అయితే, డీఏ పెంపును అక్టోబర్‌లోనూ ప్రకటించిన సందర్భాలున్నాయి. అక్టోబర్ 3న జరిగిన కేంద్రమంత్రివర్గ సమావేశంలో రైల్వే ఉద్యోగులకు 78 రోజుల బోనస్‌ను కేంద్రం ప్రకటించింది. రైల్వే ఉద్యోగులకు రూ.2029కోట్ల బోనస్‌ను ఆమోదించినట్లు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ నెల 9న జరిగిన కేబినెట్ సమావేశంలో డీఏ ప్రకటిస్తారని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఆశించారు. సెప్టెంబర్ 30న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్‌బీ యాదవ్ కేంద్ర ఆర్థిక మంత్రికి లేఖ రాశారు. జాప్యం చేయకుండా డీఏ పెంచాలని డిమాండ్ చేశారు. అక్టోబర్‌లో అలవెన్స్ ప్రకటిస్తే.. నవంబర్‌లో చెల్లింపులు చేయవచ్చన్నారు.

**ఆలస్యంతో కేంద్రానికే లబ్ధి**

డీఏను సకాలంలో విడుదల చేయకపోవడంతో కేంద్ర ప్రభుత్వమే లాభపడుతున్నది ఉద్యోగ సంఘాల నేతలు పేర్కొంటున్నారు. ఆర్థిక మంత్రికి రాసిన లేఖలో డియర్‌నెస్ అలవెన్స్ డియర్‌నెస్ రిలీఫ్ గడువు జూలై ఒకటిన ముగియనుందని.. సాధారణంగా సెప్టెంబర్‌లో చివరి వారంలో డీఏ పెంపు ప్రకటన ఉంటుందని ఎస్‌బీ యాదవ్ పేర్కొన్నారు. అక్టోబర్ మొదటి వారంలో ఉద్యోగులకు మూడునెలల బకాయిలు చెల్లించారు. అలవెన్సుల ప్రకటనలో జాప్యంపై కేంద్ర ఉద్యోగులు, పెన్షనర్లలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. నవరాత్రి, దుర్గాపూజ, దసరా పండగలు ముగిసినా కానీ పెంపుపై ప్రకటన చేయలేదు. డీఏ, డీఆర్ పెంపుతో ప్రభుత్వంపై రూ.వేలకోట్ల భారంపడుతుందని.. మూడు, నాలుగు నెలలు ఆలస్యంగా ప్రకటిస్తున్నది. ఈ కాలంలో ప్రభుత్వం పెట్టుబడులు పెట్టి తద్వారా వడ్డీ ద్వారా ఆదాయం పొందుతుందని ఉద్యోగ సంఘాల నేతలు పేర్కొంటున్నారు. జనవరి ఒకటి, జూలై ఒకటి నుంచి డీఏ, డీఆర్ పెంచాలని నిబంధన ఉన్నది. కేంద్ర ప్రభుత్వం ప్రతిసారీ మూడు నుంచి నాలుగు నెలలు ఆలస్యం చేస్తూ వస్తున్నది. ఇలా ఆలస్యమైతే ప్రభుత్వానికి వేలకోట్లు ఆదా అవుతాయని ఇండియా డిఫెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (%ూ×ఇజుఖీ%) జనరల్ సెక్రటరీ, నేషనల్ కౌన్సిల్ (%జీజవీ%) స్టాఫ్ సైడ్ సీనియర్ సభ్యుడు సీ శ్రీకుమార్ పేర్కొన్నారు.

## విమానాలకు బాంబు బెదిరింపులు..

# కీలక నిర్ణయం తీసుకున్న కేంద్రం..!

దేశంలోని పలు విమానాలు, విమానాశ్రయాలకు బాంబు బెదిరింపులు భారీగా పెరిగాయి. ఈ బెదిరింపులు కేంద్ర ప్రభుత్వానికి సవాల్‌గా మారాయి. దేశవ్యాప్తంగా ఉన్న విమానాశ్రయాల నుంచి వచ్చే విమానాల్లో స్కై మార్షల్స్‌ని రెట్టింపు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. విమానాలు, విమానాశ్రయాలకు పెరుగుతున్న ముప్పును అంచనా వేసి.. నిఘా సంస్థల నుంచి వచ్చిన ఇన్‌పుట్స్ అందిన తర్వాత స్కై మార్షల్ సంఖ్యను రెట్టింపు చేయాలని నిర్ణయించినట్లు హోంమంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి తెలిపారు. గడిచిన మూడురోజుల్లో 12 విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ క్రమంలో భద్రతా ఏజెన్సీలు తనిఖీలు నిర్వహించి.. ఫేక్ బెదిరింపులుగా తేల్చారు. నిరంతరం పెరుగుతున్న బెదిరింపుల మధ్య బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ, పౌర విమానయాన మంత్రిత్వ శాఖతో చర్చించింది. ఈ చర్చల్లో బెదిరింపులను గుర్తించడానికి, నో ఫ్లై జాబితాలో చేర్చేందుకు ఏజెన్సీలు కలిసి పని చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తున్నది. దాంతో పాటు ఎఫ్ఐఏ నివేదిక ఆధారంగా సెన్సిటివ్ కేటగిరిలో చేర్చిన కొత్త అంతర్జాతీయ మార్గాల్లో కొత్త బ్యాచ్ ఎయిర్ మార్షల్స్‌ని మోహరించనున్నట్లు అధికారి చెప్పారు. భద్రతా సంస్థలతో పలు సమావేశాల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, పార్లమెంటరీ కమిటీ ముందు ఈ అంశాన్ని లేవనెత్తారు. విమానాశ్రయాలు, విమానాలకు వస్తున్న బెదిరింపుల అంశం బుధవారం పార్లమెంటరీ కమిటీలో వేడెక్కింది. ఈ విషయమై ఎంపీలు అడిగిన ప్రశ్నలకు పౌర విమానయాన శాఖ కార్యదర్శి వుమ్లున్మాంగ్ వుల్నమ్ స్పందిస్తూ.. నిందితులను గుర్తించే పనిలో ఉన్నట్లు తెలిపారు. ఏజెన్సీలు చర్యలు తీసుకుంటున్నాయని.. అధికారులు కొంత సమాచారాన్ని సేకరించాయన్నారు. ఫేక్ మెసేజ్‌లపై కేసులు నమోదు చేస్తున్నారన్నారు. ఈ విషయంపై విచారణ కొనసాగుతున్నందున.. సమాచారం సున్నితత్వాన్ని దృష్టిలో పెట్టుకొని వివరాలను చెప్పేందుకు ఆ అధికారి నిరాకరించారు.



**స్కై మార్షల్స్ అంటే..?**

ఎయిర్ మార్షల్స్ తీవ్రవాద, హైజాకింగ్ నిరోధక చర్యల్లో పాల్గొంటారు. నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్‌లోని విభాగం. స్కై మార్షల్ ప్రధానంగా అంతర్జాతీయ మార్గాలు, కొన్ని సున్నితమైన మార్గాల్లో మోహరిస్తుంటారు. స్కై మార్షల్స్ సాధారణ దుస్తుల్లో ప్రయాణికులతో కలిసి ప్రయాణిస్తుంటారు. కాందహార్‌లో ఎయిర్ ఇండియాకు చెందిన ఐసీ814 విమానాన్ని హైజాక్ చేసిన అనంతరం.. భవిష్యత్‌లో మరోసారి హైజాక్ జరుగకుండా ఉండేందుకు 1999లో భారత్ తొలిసారిగా స్కై మార్షల్స్‌ని ప్రవేశపెట్టింది. స్కై మార్షల్‌ని ఫ్లై సెక్యూరిటీ ఆఫీసర్ అని కూడా పిలుస్తారు.

## జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఒమర్ అబ్దుల్లా..



ఇవాళ ఉదయం జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అగ్ర నేత ఒమర్ అబ్దుల్లా మధ్యాహ్నం సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకుంటున్నట్టు ఆయన సంబంధిత ఫైలుపై సంతకం చేశారు. అనంతరం జమ్ముకశ్మీర్ ప్రభుత్వంలోని వివిధ విభాగాలకు చెందిన సెక్రెటరీలతో ఒమర్ సమావేశమయ్యారు. జమ్ముకశ్మీర్‌కు సంబంధించిన వివిధ అంశాలపై ఆయన వారితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన అధికారుల నుంచి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు. కాగా ఉదయం 11.30 గంటలకు ఒమర్ అబ్దుల్లా జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించారు. శ్రీనగర్‌లోని 'షేర్ ఇ కశ్మీర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్'లో ఈ ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వివిధ పార్టీలకు చెందిన పలువురు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. వారిలో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా తదితరులు ఉన్నారు. ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్, పీడీపీ అధ్యక్షురాలు, జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ, ఆప్ సీనియర్ నేత సంజయ్ సింగ్, సీపీఐ నేత డీ రాజా కూడా కార్యక్రమానికి హాజరయ్యారు. ఒమర్ అబ్దుల్లా గతంలో కూడా జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత బీజేపీ, పీడీపీ కూటమి అక్కడ అధికారం చేపట్టింది. 2018లో కూటమి సర్కారు కూలిపోవడంతో రాష్ట్రపతి పాలన అమల్లోకి వచ్చింది. ఆ తర్వాత కేంద్రం జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దుచేసింది. ఆర్టికల్ 370 రద్దు అనంతరం ఇప్పుడే తొలిసారిగా జమ్ముకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి.

## జమ్ముకశ్మీర్‌లో భారీ అగ్నిప్రమాదం



**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఒక గ్రామంలో సుమారు 68 ఇళ్లు దగ్ధమయ్యాయి. ఇళ్లు కాలిపోవడంతో నివాసితులు రోడ్డు పాలయ్యారు. స్పందించిన అధికారులు బాధితులకు తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. మంగళవారం మధ్యాహ్నం కిష్త్వార్‌లోని ముల్వార్వాన్ గ్రామంలో మంటలు చెలరేగాయి. ఈ అగ్నిప్రమాదంలో 68 ఇళ్లు కాలిపోయాయి. దీంతో వందలాది నివాసితులు కట్టుబట్టలతో మిగిలారు. చలి వాతావరణం నేపథ్యంలో పిల్లలు, వృద్ధులు చాలా ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఇళ్లు కోల్పోయిన బాధితులు కోరారు. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న అధికారులు స్పందించారు. అగ్నిప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన వారికి తాత్కాలిక టెంట్లలో ఆశ్రయం కల్పించారు. బాధిత కుటుంబాలకు ఆహారం, దుస్తులు, వైద్య, సహాయక సామగ్రిని అందించినట్లు కిష్త్వార్ డిప్యూటీ కమిషనర్ రాజేష్ కుమార్ తెలిపారు. ఈ విషయం తెలిసిన వెంటనే విపత్తు నిర్వహణ బృందాలను సంఘటనా స్థలానికి పంపినట్లు చెప్పారు. మరోవైపు ఈ అగ్నిప్రమాదంలో 40 ఇళ్ళు దెబ్బతిన్నట్లు తొలుత తెలిసిందని రాజేష్ కుమార్ తెలిపారు. అయితే మొత్తం 68 ఇళ్ళు కాలిపోయాయని చెప్పారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయంతోపాటు పునరావాసాన్ని కల్పించే చర్యలు చేపడతామని వెల్లడించారు.

## ఏక్‌నాథ్ షిండేనే మహాయుతి సీఎం అభ్యర్థి



**ముంబై:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మహాయుతి ప్రతిపక్ష మహా వికాస్ అఘాడి మధ్య సీఎం అభ్యర్థి ఎవరనే విషయంలో సవాళ్లు, ప్రతిసవాళ్లు కొనసాగుతున్నాయి. అధికార మహాయుతి ముందుగా సీఎం అభ్యర్థిని ప్రకటించి ఎన్నికలకు రావాలంటూ ఎంవీఏ సవాలు విసిరిన నేపథ్యంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తొలిసారి స్పందించారు. ఏక్‌నాథ్ షిండేనే మహాయుతి సీఎం అభ్యర్థి అంటూ పరోక్షంగా సంకేతాలిచ్చారు. తమ ముఖ్యమంత్రి ఇక్కడే కూర్చున్నందున సీఎం అభ్యర్థి ఎవరనేది ప్రకటించాల్సిన అవసరం మహాయుతి సర్కార్‌కు లేదన్నారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రులు అజిత్ పవార్, ఫడ్నవిస్ బుధవారంనాడిక్కడ మీడియా సమావేశంలో పాల్గొన్నారు. "సీఎం అభ్యర్థిని ప్రకటించాల్సిన పని మాకు లేదు. మా ముఖ్యమంత్రి ఇక్కడే కూర్చున్నారు. మరి మీ ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో ప్రకటించాలని పవార్ సాహెబ్ (శరద్ పవార్)ను నేను సవాల్ చేస్తున్నాను" అని ఫడ్నవిస్ అన్నారు. ఎన్నికల తర్వాత ఎలాగూ అధికారంలోకి రామని తెలిసే సీఎం అభ్యర్థిని ఎంవీఏ ప్రకటించడం లేదన్నారు

**పవార్ ఏమన్నారు?**

సీఎం అభ్యర్థి విషయంలో శరద్ పవార్ గత నెలలో స్పష్టతనిస్తూ, ఎన్నికలకు ముందు సీఎం అభ్యర్థిని ప్రకటించాల్సిన అవసరం ఎంవీఏకు లేదని, సమష్టి నాయకత్వం కింద తమ కూటమి పోటీ చేస్తుందని చెప్పారు. సభ్యులను (గెలిచిన సీట్ల సంఖ్యను) బట్టే నాయకత్వ పగ్గాలు చేపట్టేదెవరనే నిర్ణయం ఉంటుందని, ఎన్నికలకు ముందు అలాంటి అవసరం లేదని స్పష్టం చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఒకే విడతలో నవంబర్ 20న జరుగనుండగా, నవంబర్ 23న ఫలితాలు వెలువడతాయి.

## వయానాడ్ నుంచి బరిలోకి ప్రియాంక

**న్యూఢిల్లీ :** మరో కీలక ఎన్నికల సమరానికి నగారా మోగింది. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీలతో పాటు కీలకమైన వయనాడు లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నిక జరగనుంది. నవంబర్ 13న వయనాడు పార్లమెంట్ స్థానానికి ఎన్నిక నిర్వహించనున్నట్టు ఈసీ ప్రకటించింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో పాటు నవంబర్ 23న వయనాడు ఉప ఎన్నికకు సంబంధించిన ఓట్ల లెక్కింపు జరుగుతుందిఈసారి కాంగ్రెస్ పార్టీకి మహారాష్ట్ర, జార్ఖండ్‌తో పాటు వయనాడు పార్లమెంట్ ఉప ఎన్నిక ఎంతో ప్రత్యేకమైందనే చెప్పాలి. ఇందుకు ప్రధాన కారణంగా గాంధీ కుటుంబానికి చెందిన ప్రియాంక గాంధీ ఇక్కడి నుంచి పోటీ చేయనుండటమే. గత సార్వత్రిక ఎన్నికల్లో వయనాడుతో పాటు యూపీలోని రాయ్‌బరేలీ నుంచి పోటీ చేశారు కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్ గాంధీ. రెండు స్థానాల్లోనూ భారీ మెజార్టీతో గెలిచారు. ఈ రెండు స్థానాల్లో ఆయన ఏ సీటును వదులుకుంటారనే దానిపై కొద్దిరోజులు సస్పెన్స్ కొనసాగింది. అయితే రాయ్‌బరేలీ సీటు నుంచి ఎంపీగా కొనసాగాలని డిసైడయిన రాహుల్ గాంధీ.. వయనాడు ఎంపీ పదవికి రాజీనామా చేశారు. తాను వయనాడు ఎంపీగా రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించిన రాహుల్ గాంధీ.. తన స్థానంలో వయనాడు నుంచి పోటీ చేయబోయేది ఎవరనే అంశంపై కూడా క్లారిటీ ఇచ్చేశారు. తన చెల్లెలు ప్రియాంక గాంధీ పోటీ చేస్తారని తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించారు.

# హైడ్రా కారణంగా భయానక వాతావారణం



**హైదరాబాద్ :** తెలంగాణ భవన్ లో నగర ఎమ్మెల్యేలు.. ఎమ్మెల్సీలతో మూసీ ప్రాజెక్టు పైన కేటీఆర్ సమావేశం నిర్వహించారు. తరువాత మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆనాలోచిత నిర్ణయాల కారణంగా హైదరాబాద్‌లో పేదలు దిగువ మధ్యతరగతి ప్రజలు సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రభుత్వం ఆనాలోచితంగా, ప్రణాళిక లేకుండా పేదలకు ఎవరూ అండగా లేరన్నట్లుగా దూకుడుగా వారి మీదకు వెళ్తోంది. మోడీ నోట్ల రద్దు చేసినప్పుడు ఏ విధంగా రకరకాల కారణాలు మారుస్తూ చెప్పారో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పద్దతి అవలంభిస్తోంది. ఒక రోజు మూసీ సుందరీకరణ అంటారు. ఒక రోజు నల్గొండకు నీళ్లు అంటారు. ఒక రోజు రూ. లక్షా 50 వేల కోట్లు ఎక్కడివి అంటారు. ఒక రోజు డీపీఆర్ లేనే లేదంటారని అన్నారు. ఒక ప్రణాళిక, ఆలోచన లేకుండా ముందుకు వెళ్తున్నారు. ప్రభుత్వమే 50 ఏళ్ల క్రితమే పర్మిషన్లు ఇచ్చి ఇప్పుడు వాటిని కూలగొడతామని దుందుడుకుగా పోతామంటే కుదరదు. హైడ్రా, మూసీ ప్రాజెక్ట్ విషయంలో ఒక భయానక వాతావారణాన్ని సృష్టించారు.

హైడ్రాను పెద్ద, పెద్ద బిల్డర్లను బెదిరించేందుకే ఉపయోగిస్తున్నారని మేము నమ్ముతున్నాం. మూసీ పేరిట ఏ విధంగా లూటీ చేస్తున్నారో ప్రజల దృష్టికి తీసుకెళ్తాం. మూసీ కి సంబంధించి 100 శాతం మురుగు నీటి శుద్ధి ప్లాంట్లను మేము రూ. 4 వేల కోట్లతో నిర్మించామని అన్నారు.

మూసీ శుద్ధి మేము చేశాం. దీంతో ఇక నల్గొండ జిల్లాకు వెళ్లే నీళ్లన్ని శుద్ధి చేసిన నీళ్లే వెళ్తాయి. దాని కోసం కొత్తగా ఖర్చు చేయాల్సిన పని లేదు. కొండపోచమ్మ సాగర్ నుంచి గండిపేట్ కు నీళ్లు తెచ్చేందుకు 11 వందల కోట్లు ఖర్చు చేయాలని మేము నిర్ణయం తీసుకున్నాం. ఇక రూ. లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. నల్గొండకు మంచి నీళ్లు ఇచ్చే ఏర్పాట్లు మేము చేశాం. ఇక నల్గొండ కు నీళ్లు ఇచ్చే ఇష్టం లేదా అంటూ ముఖ్యమంత్రి గారు ఆరోపణలు చేయాల్సిన అవసరం లేదు. గతంలోనే మేము మూసీ సుందరీకరణ చేపట్టాలని సుధీర్ రెడ్డి ఛైర్మన్ గా ప్రయత్నం చేశాం. కానీ గరీబోళ్లకు అన్యాయం జరుగుతదంటే ఆ ప్రాజెక్ట్ వద్దని కేసీఆర్ చెప్పారు. మానవీయ ముఖ్యమంత్రి ఉంటే ఆ విధంగా నిర్ణయాలు ఉంటాయి. మూసీ సుందరీకరణ మేము కూడా చేశాం. కానీ ఒక్క పేదవాడి కడుపు కూడా కొట్టలేదు. మూసీ సుందరీకరణకు రూ. లక్షా 50 వేల కోట్లు ఎందుకో చెప్పాలి. 50 ఏళ్ల క్రితం పట్టాలిచ్చిన వారిని హైడ్రా పేరుతో కూల్చివేస్తామంటే కుదరదు, మీరు చేసిన తప్పునకు పేదలను బలి చేస్తారా? మీరే పట్టాలిచ్చి మీరే కూలగొడుతారా అని ప్రశ్నించారు. పేదలకు ఎవరు దిక్కు లేరన్నట్లుగా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తామంటే బీఆర్ఎస్ ఊరుకోదు. హైదరాబాద్ లోని పేదలకు బీఆర్ఎస్ రక్షణ కవచంగా ఉంటుంది. రేవంత్ రెడ్డి పంపే బుల్డోజర్లకు అడ్డుగా మా నాయకులు ఉంటారు. మేము నిర్మించిన అన్ని ఎస్టీపీలను కూడా మా ప్రజాప్రతినిధులతో కలిసి పర్యటిస్తామని అన్నారు. మా ప్రభుత్వం ఉన్నప్పుడు నాలా డెవలప్ మెంట్ కార్యక్రమం తీసుకున్నాం. దాని ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయి. ఆయా ప్రాంతాలను కూడా సందర్శిస్తాం. హైడ్రా పేరుతో ప్రభుత్వం భయపెడుతున్న అన్ని ప్రాంతాలకు వెళ్లి అక్కడి ప్రజలకు మేము భరోసా ఇస్తాం. అదే విధంగా ప్రభుత్వం చట్టాన్ని గౌరవించకపోతే మేము న్యాయపరంగా కూడా పోరాటం చేస్తాం. ఆర్ఎస్ లీగల్ సెల్ కు దాదాపు 450 మంది వచ్చి అండగా ఉండాలని కోరారు. మా పార్టీ లీగల్ సెల్ ను మరింత బలోపేతం చేస్తాం. లీగల్ సెల్ వాళ్లు చాలా కష్టపడి పనిచేస్తున్నారు. వారికి అభినందనలు. ఈ ప్రభుత్వం చట్టానికి వ్యతిరేకంగా పనిచేస్తూ ప్రజలను కబ్జాదారులు అంటున్న విధానాన్ని ఎండగడతాం, హైడ్రా కారణంగా భయానక వాతావారణం వచ్చింది. మొన్న హైడ్రా పేరుతో కాంగ్రెస్, ఎంఐఎం నాయకులే కొట్టుకున్నారు. ఈ ప్రభుత్వ దిక్కుమాలిన పాలన కారణంగా హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ మొత్తం పడిపోయింది. మాకు అప్పు పుట్టటం లేదని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అంటున్నారు. మీ ముఖ్యమంత్రే దివాళా కోరు మాటలు మాట్లాడితే అప్పులు ఎలా పుడుతాయి. నిర్మాణం కాదు విధ్వంసం చేస్తామంటే ఇలాంటి పరిస్థితే ఉంటుంది. బీజేపీ నాయకుల కన్నా ఎక్కువగా రేవంత్ రెడ్డి దేశ రక్షణ గురించి మాట్లాడుతున్నాడు. ఆయన మాటలు ఆశ్చర్యంగా అనిపించాయి. దేశ రక్షణకు బీఆర్ఎస్ కట్టుబడి ఉంది. ఏ మూసీ సుందరీకరణ అంటున్నావో, అదే ప్రాంతంలో 12 లక్షల చెట్లు నరికివేసి ఒక్క ఉద్యోగం ఇవ్వకుండా ఎలా న్యాయం చేస్తారు. గంగా నది పుట్టిన గంగోత్రి వద్ద 150 కిలోమీటర్లు ఎకో సెన్సిటివ్ జోన్ అంట. మరి మూసీకి కనీసం 10 కిలోమీటర్ల ఎకో సెన్సిటివ్ జోన్ లేదా? మేమే కేబీఆర్ పార్క్ వద్ద ఫ్లై ఓవర్లు కట్టాలని అనుకున్నాం. పర్యావరణం దెబ్బతింటుందంటే ఆ ప్రతిపాదనలను విరమించుకున్నాం. 2017 లో రాడార్ నిర్మాణం కోసం జీవో ఇచ్చినప్పటికీ పర్యావరణం దెబ్బ తింటుందంటే మేము ఆ జీవో ను తొక్కి పెట్టామని అన్నారు. మేము జీవో ఇచ్చామని చెబుతున్నావ్. మేము చేసిన పనులన్నీ చేస్తున్నావా? రైతు బంధు, 24 గంటల కరెంట్, ఫించన్, పాలమూరు ఎత్తిపోతల మేము చేశాం. మరి నువ్వు వాటిని చేస్తున్నావా? మేము పర్యావరణ రక్షణ కోసం పనిచేశాం కాబట్టే ఇచ్చిన జీవోలను నిలిపివేశాం. రేవంత్ రెడ్డికి ప్రధాని మోడీని ఒక్క మాట అనాలంటే దడ. అందుకే మనకు కేంద్ర బడ్జెట్ లో అన్యాయం జరిగినప్పటికీ అసెంబ్లీలో ఒక్క మాట మాట్లాడలేదని అన్నారు. జనవాసాలు లేని చోట పెట్టే రాడార్ కేంద్రాన్ని?తెలంగాణలో ఎందుకు పెట్టినట్లు? మూసీని పురిట్లోనే ఆగం చేసి కింద మాత్రం మంచి చేస్తామంటే ఎవరూ నమ్ముతారు. హైదరాబాద్ లో ప్రజలకు భరోసా ఇచ్చేందుకు మా నాయకులంతా కలసికట్టుగా కదులుతాం. ప్రజలకు ఏమైనా ఇబ్బంది వస్తే మా ప్రజాప్రతినిధులను కలవండి. లేదంటే తెలంగాణ భవన్ కు రండి. మీకు న్యాయం తప్పకుండా జరగుతుంది. మా ఫార్మ్ హౌస్ లు చట్ట విరుద్దంగా ఉంటే వాటిని కొట్టేయండి. మా ఫార్మ్ హౌస్ లు కూలగొడితే నీకు రాక్షస ఆనందం వస్తదంటే కూలగొట్టు. కానీ పేద ప్రజల జోలికి వెళ్లకు. పేద ప్రజలను ఆగం చేస్తామంటే వారి ఇళ్లు కూలగొడతామంటే ఊరుకోం, మేము అధికారంలోకి వచ్చే నాటికి ఉన్న బకాయి ఫీజు రీయింబర్స్ మెంట్ 2 వేల కోట్లను చెల్లించాం. ప్రభుత్వం అనేది కంటిన్యూ ప్రాసెస్. గత ప్రభుత్వ బకాయిలను చెల్లించాలి. రూ. 650 కోట్లు ఇస్తే సరిపోతుందని కాలేజీ యాజమాన్యాలు చెబుతున్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లిస్తే దాదాపు 12 లక్షల మందికి మేలు జరుగుతుంది. గత ప్రభుత్వాలు బకాయిలు పెడితే ఇప్పుడు ఉన్న ప్రభుత్వాలు కట్టాల్సిందే. అది నెక్స్ మేము అధికారంలోకి వచ్చినా తప్పదని అన్నారు. రేవంత్ రెడ్డి 10 నెలల్లో 80 వేల కోట్ల అప్పు చేశారు. ఒక్క కొత్త ప్రాజెక్ట్ కూడా చేపట్టలేదు. మరి అంత డబ్బు ఎక్కడికి పోయింది. మన రాష్ట్రం రెవెన్యూ సర్ ప్లేస్ స్టేట్. మనం అన్ని కట్టిన తర్వాత కూడా మిగులు ఉందని భట్టి చెప్పారు. మరీ ఎందుకు ఇంత పెద్ద ఎత్తున అప్పు చేశారో చెప్పాలి. హైడ్రా, మూసీ పేరుతో సృష్టిస్తున్న భయాకన వాతావారణం నుంచి ప్రజలను రక్షించేందుకు బీఆర్ఎస్ కదులుతోంది. త్వరలోనే షెడ్యూల్ ప్రకటిస్తామని అన్నారు.

# ఇందిరమ్మ కమిటీలతో పార్టీ బలోపేతం

హైదరాబాద్



తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పాలన ద్వారా పార్టీని బలోపేతం చేసేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయడానికి ఇందిరమ్మ కమిటీలను ఓ అవకాశంగా ఉపయోగించుకోవాలని నిర్ణయించారు. కాస్త ఆలస్యమైనా ఇందిరమ్మ కమిటీల ఏర్పాటును ప్రకటిస్తూ నిర్ణయం తీసుకున్నారు. రాబోయే స్థానిక ఎన్నికల నాటికి గ్రామాలన్నింటిపై ఇందిరమ్మ కమిటీల ప్రభావం ఉండేలా చూసుకోనున్నారు. అంటే.. ప్రతి ప్రభుత్వ లబ్దిదారుడు కాంగ్రెస్ ను దాటిపోడు. అంతే కాదు ఇతర కాంగ్రెస్ సంప్రదాయ ఓటర్లనూ చేజారిపోకుండా చూసుకోవచ్చు. రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరవాత ఇందిరమ్మ కమిటీల ప్రస్తావన తెచ్చారు. ప్రభుత్వ ప్రతి పథకం ప్రజలకు ఇందిరమ్మ కమిటీల ద్వారానే చేరుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని పార్టీని ప్రతి ఇంటికి తీసుకెళ్లేలా చేయాలని ఆయన అనుకున్నారు. కారణం ఏమైనా తర్వాత ఆలస్యం జరిగింది. రుమమాఫీని ప్రకటించారు. హడావుడిగా అమలు చేశారు. కానీ ఆ రుణమాపీని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం సరిగ్గా జరగలేదు. ఇందిరమ్మ కమిటీలు ఉంటే నేరుగా ఇంటింటికి తీసుకెళ్లేవారు. ఆలస్యంగా అయినా ఇప్పుడు ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇప్పుడు ఆ కమిటీ చేతుల మీదుగానే ఇళ్ల నిర్మాణ పథకానికి లబ్దిదారులను ఎంపిక చేయబోతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్ని ఇప్పటికే నిర్వహించాల్సి ఉంది. కానీ కులగణన తర్వాతనే ఎన్నికలు నిర్వహిస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆ మేరకు ఇప్పుడు ప్రక్రియను ప్రారంభించారు. నివేదిక వచ్చిన తర్వాత ఇతర చట్టపరమైన పనులు పూర్తి చేసి ఎన్నికలు నిర్వహించాలంటే మరో నాలుగైదు నెలల సమయం పట్టవచ్చు. పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ పాలక మండలులు గడువు మాత్రమే ఇప్పటికి ముగిసింది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల గడువు మరో ఏడాది వరకూ ఉంది. అన్నీ ఒకే సారి పెట్టేద్దామని అనుకుంటే.. మరో ఏడాది తర్వాత ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. అప్పటికి ఇందిరమ్మ కమిటీ గ్రామాల్లో పట్టు సాధించే అవకాశం ఉంది. నిజానికి ఇందిరమ్మ కమిటీలు వంటి ఏర్పాటు రెండు వైపులా పదునున్న కత్తి లాంటివి. ఎందుకంటే ఎంత ప్లస్ ఉంటుందో అంత మైనస్ ఉంటుంది. ఈ కమిటీల సభ్యులు ప్రజలతో పారదర్శకంగా వ్యవహరించారు.

# డ్రగ్స్ ఫ్రీ కోసం రంగంలోకి అకున్ సబర్వాల్



**హైదరాబాద్, శుభ తెలంగాణ :** తెలంగాణలో డ్రగ్స్ మాట వినపడాలంటే భయపడాలంటూ పిలుపునిచ్చారు. డ్రగ్స్ మహమ్మారితో కుటుంబాలు నాశనం అవుతున్నాయని, ఉద్యమాలకు కేరాఫ్ అయిన తెలంగాణ డ్రగ్స్ రాజ్యమేలుతోందని ఆ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే.. రాష్ట్రంలో డ్రగ్స్ మాఫియాను తరిమికొట్టేందుకు వేగంగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధమయ్యారని అర్థం అవుతోంది. ఇందుకోసం ఆయన ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రి బాధ్యతల స్వీకరణ సందర్భంలోనూ రేవంత్ డ్రగ్స్ మహమ్మారిపై కీలక వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు రాష్ట్రాన్ని డ్రగ్స్ ఫ్రీ తెలంగాణగా మారుస్తానంటూ శపథం చేశారు. తెలంగాణలో డ్రగ్స్ మాట వినపడాలంటే భయపడాలంటూ పిలుపునిచ్చారు. డ్రగ్స్ మహమ్మారితో కుటుంబాలు నాశనం అవుతున్నాయని, ఉద్యమాలకు కేరాఫ్ అయిన తెలంగాణ డ్రగ్స్ రాజ్యమేలుతోందని ఆ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే.. రాష్ట్రంలో డ్రగ్స్ మాఫియాను తరిమికొట్టేందుకు వేగంగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.ఇదిలా ఉంటే.. ఇటీవల రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కేటీఆర్ పై వ్యాఖ్యలు చేసిన సందర్భంగా సినీ నటుడు నాగార్జున ఫ్యామిలీని కూడా ప్రస్తావించారు. నాగచైతన్య-సమంత విడాకుల అంశాన్ని ఆమె లేవనెత్తారు. దాంతో నాగార్జున ఆ వ్యాఖ్యల్ని సీరియస్‌గా తీసుకున్నారు. అటు యావత్ టాలీవుడ్ సినీ ప్రపంచం కూడా సురేఖ వ్యాఖ్యల్ని ఖండించారు. అందరూ ఏకతాటిపైకి వచ్చి సురేఖ వ్యాఖ్యల్ని తప్పుబట్టారు. దాంతో ప్రతిపక్షంతో కలిసి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నం చేశారు. నాగార్జునకు సంబంధించిన ఎన్ కన్వెన్షన్ హైడ్రా కూల్చివేసినప్పటికీ ఎవరూ పెద్దగా స్పందించలేదు. అలాగే.. నంది అవార్డులను కాస్త గద్దర్ అవార్డులుగా మార్చినప్పుడు కూడా పెద్దగా పట్టించుకోలేదు. ఇక దాంతో అప్పటి నుంచే టాలీవుడ్ వర్సెస్ ప్రభుత్వం అన్నట్లుగా కోల్డ్‌వార్ నడుస్తూనే ఉంది. సురేఖ వ్యాఖ్యలపై ఒక్కసారిగా అందరూ ముందుకు రావడంతో ప్రభుత్వం పెద్దలు కూడా సీరియస్‌గా తీసుకున్నారు.ఇందులో భాగంగానే గతంలో టాలీవుడ్ డ్రగ్స్ కేసును మరోసారి తెరమీదకు తీసుకొచ్చేందుకు ప్లాన్ సిద్ధం చేసినట్లు సమాచారం. అందుకే.. టాలీవుడ్ డ్రగ్స్ కేసులో కీలకంగా వ్యవహరించిన ఐపీఎస్ అకున్ సబర్వాల్‌ను మరోసారి తెలంగాణకు తీసుకొస్తున్నారు. మరోసారి ఆ కేసును తోడి అందులో భాగస్వాములైన వారిపై చర్యలు తీసుకునేలా ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. అయితే.. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ అప్పీల్‌తో పలువురు సినీ ప్రముఖులు డ్రగ్స్ మహమ్మారికి వ్యతిరేకంగా షార్ట్ వీడియోలు చేసి ప్రచారం సాగిస్తున్నప్పటికీ.. ఇంకా చాలా మంది టాలీవుడ్‌లో డ్రగ్స్ వినియోగిస్తున్నారని అపవాదు ఉంది.అందుకే..ఈ కేసుపై పూర్తి అవగాహన ఉన్న అకున్ సబర్వాల్‌ను మరోసారి రంగంలోకి దింపబోతోంది. అకున్ ఎంట్రీతో మరోసారి టాలీవుడ్‌లో ప్రకంపనలు మొదలు కానున్నాయన్న టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే చాలా మంది టాలీవుడ్ ప్రముఖులను ఆయన విచారించారు. ఇంకా కొంత మందిని విచారించే క్రమంలో ఆయనను బదిలీ తప్పలేదు. దాంతో అప్పటి నుంచి ఆ కేసు మూలనపడింది. ఇక ఇప్పుడు ఆయన రాకతో ఈ డ్రగ్స్ కేసు ఎటు మలుపు తిరుగుతుందా అని ఉత్కంఠ అందరిలోనూ కనిపిస్తోంది. ముఖ్యంగా టాలీవుడ్‌లో ఆ టెన్షన్ మరింత ఎక్కువైనట్లుగా ప్రచారం జరుగుతోంది. మొత్తానికి తెలంగాణను డ్రగ్స్ ఫ్రీ స్టేటుగా మార్చే క్రమంలో రేవంత్ సర్కార్ మరోసారి టాలీవుడ్ నుంచే తన పనిని మొదలుపెట్టబోతున్నారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

## ఒకే దఫాలో.. కులగణన

-మొదటిపేజీ తరువాయి

అంచనా వేసింది. అయితే ఇంత పెద్దమొత్తంలో సిబ్బంది కమిషన్‌కు అందుబాటులో లేకపోవడంతో.. ఆ బాధ్యతను ప్రభుత్వం రాష్ట్ర ప్రణాళిక విభాగానికి అప్పగించింది. దీంతో కులగణనకు అవసరమైన సిబ్బందిని అన్ని ప్రభుత్వ విభాగాల నుంచి తీసుకోవాలని ప్రణాళిక విభాగం నిర్ణయించింది. గణన షెడ్యూల్, ప్రశ్నావళిని ప్రభుత్వం విడుదల చేసిన తరువాత.. సిబ్బందిని విభాగాల వారీగా తీసుకోనున్నారు. అనంతరం వారికి హైదరాబాద్‌లో మాస్టర్ ట్రైనింగ్ ఇవ్వనున్నారు. మాస్టర్ ట్రైనింగ్ తీసుకున్నవారు ఆ తరువాత జిల్లాల్లోని సిబ్బందికి శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఒక్కరోజులో పూర్తిచేయనున్నారు. క్షేత్రస్థాయిలో కులగణన ప్రారంభమయ్యాక 10-15 రోజుల్లో వివరాల సేకరణ పూర్తిచేసి.. ఆ తరువాత మరో 10-15 రోజుల్లో ఆ వివరాలను కంప్యూటర్‌లో పొందుపరుస్తారు. ఆ వివరాలను బీసీ కమిషన్ పరిశీలించి, క్రోడీకరించి స్థానిక సంస్థల్లో బీసీలకు కల్పించాల్సిన రిజర్వేషన్‌లను సూచిస్తూ ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తుంది. 60 రోజుల్లో ఈ ప్రక్రియ ముగుస్తుంది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.150 కోట్లు కేటాయించింది. కాగా, ప్రభుత్వం నిర్వహించబోయే కులగణనలో కులాలతోపాటు వ్యక్తులు, వారి ఆర్థిక పరిస్థితులు, వృత్తి, ఆదాయం వంటి వివరాలను ప్రశ్నావళిలో నమోదు చేయనున్నారు. ముఖ్యంగా ఆయా కుటుంబాల్లో రాజకీయ ప్రాతినిధ్యం ఏమైనా ఉందా? గతంలో ఏమైనా రాజకీయ పదవుల్లో ఉన్నారా?అనే అంశాలను సేకరించనున్నారు. ఈ వివరాలన్నింటినీ మాన్యువల్‌గా సేకరించి.. ఏరోజుకారోజు వివరాలను ఆన్‌లైన్ చేయనున్నారు. కలెక్టర్లు ఈ బాధ్యతలను పర్యవేక్షిస్తారు.

## మళ్లీ గ్రామ రెవెన్యూ వ్యవస్థ!

-మొదటిపేజీ తరువాయి

సుమారు 25,750 మంది ఉండేవారిని తెలిపింది. వీరిలో వీఆర్‌వోలుగా 5,195 మంది ఉండగా.. ఎక్కువ మంది డిగ్రీ, ఇంటర్మీడియట్ అర్హతతో ఉన్నట్లు పేర్కొంది. ఇక వీఆర్‌ఏలు 20,555 మంది ఉండగా.. వారిలో డిగ్రీ అర్హత కలిగిన వారు 3680 మంది, ఇంటర్మీడియట్ వరకు చదివిన వారు 2761, పదో తరగతి అర్హత ఉన్నవారు 10,347 మంది ఉన్నట్లు వివరించింది. ఇకపై గ్రామస్థాయిలో నియమించే రెవెన్యూ సిబ్బందికి జేఆర్‌వో (జూనియర్ రెవెన్యూ అధికారి) లేదా గ్రామ రెవెన్యూ కార్యదర్శి అనే పేర్లు పెట్టాలని ప్రతిపాదించింది.

**కీలకం కానున్న రెండో నివేదిక..**

రాష్ట్ర వ్యాప్తంగా 10,954 రెవెన్యూ గ్రామాలకు సిబ్బందిని నియమించాల్సి ఉన్నందున.. వారిని ఎంపిక చేయాల్సిన విధానం, అర్హతలు, వేతనాల చెల్లింపులు వంటి అంశాలపై సీసీఎల్‌ఏ రెండోసారి ఇవ్వనున్న నివేదిక కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో అసలు ఎంత మందిని తీసుకోవాలి, పాతవారిని తీసుకుంటే ఏ ప్రాతిపదికన తీసుకోవాలనే దానిపై రెవెన్యూ శాఖ కసరత్తు చేస్తోంది. అయితే.. గతంలో తొలగించిన వీఆర్‌వో, వీఆర్‌ఏల నుంచి సుమారు 5వేల మందిని తీసుకోవాలని, నూతనంగా మరో 5 వేల మందిని నియమించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో గతంలో పనిచేసిన వారిలో ప్రస్తుత అవసరాలకు తగిన అర్హతలు ఉన్నవారిని తిరిగి ఎంపిక చేయాలని రెవెన్యూ ఉద్యోగుల నుంచి ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందుతున్నాయి. ఇదిలా ఉండగా.. గ్రామస్థాయిలో పనిచేసే రెవెన్యూ ఉద్యోగులకు వివిధ రకాల ధ్రువపత్రాల జారీ, ప్రభుత్వ భూముల సంరక్షణ బా?ధ్యతలు, చెరువులు, కుంటల సంరక్షణ, భూ సమస్యలపై క్షేత్ర స్థాయి విచారణలు, సర్వే పనులకు సహాయకులుగా, విపత్తుల సమయంలో సేవలందించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించడం, ఎన్నికల విధులు, అభివృద్ధి కార్యక్రమాల్లో ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవడం వంటి విధులు నిర్వహించే బాధ్యతలు అప్పగించాలిన తొలుత ఇచ్చిన నివేదికలో సీసీఎల్‌ఏ ప్రతిపాదించింది.

## తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

-మొదటిపేజీ తరువాయి

వీసీలను ప్రభుత్వం మార్చింది. కోఠి మహిళా యూనివర్సిటీ ఇంఛార్జి వీసీగా ధనావత్ సూర్య, బాసర ట్రిపుల్ ఐటీ ఇంఛార్జి వీసీగా ప్రొఫెసర్ గోవర్ధన్‌ను నియమించారు. కాగా, సూర్య ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల తెలుగు విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

## తెలంగాణలో ఘోర రోడ్డు ప్రమాదం...

**కారు కాల్వలో పడి ఏడుగురి మృతి**

**మృతుల్లో నలుగురు మహిళలు, ఇద్దరు బాలికలు**

**మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలో విషాదం**

**కారు కాల్వలో పడటంతో నీళ్లలో మునిగి మృతి**

తెలంగాణలోని మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ కారు అదుపు తప్పి కాల్వలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఏడుగురు మృతి చెందారు. మృతి చెందినవారిలో నలుగురు మహిళలు, ఇద్దరు బాలికలు, ఓ పురుషుడు ఉన్నారు. మెదక్ జిల్లాలోని శివ్వంపేట మండలం ఉసిరికపల్లి వద్ద ఈరోజు సాయంత్రం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతులను పాముబండ తండాకు చెందిన వారిగా గుర్తించారు. రోడ్డుపై గుంతలు ఉండటంతో వేగంగా వెళుతున్న కారు కల్వర్టును ఢీకొట్టింది. కారు ఎగిరి పక్కనే ఉన్న కాల్వలో పడింది. దాంతో కారులో ఉన్న వారు నీట మునిగి చనిపోయారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారిగా గుర్తించారు. కారు నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు.

**సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి**

మెదక్ జిల్లా రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అధికారులతో మాట్లాడి ప్రమాదం వివరాలు తెలుసుకున్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని, అవసరమైన సాయం అందించాలని ఆదేశించారు.

## ముఖ్య నేతల కోసమే ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్ మార్చారు

-మొదటిపేజీ తరువాయి

అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఉన్న పథకాలు బంద్ పెట్టడమే కాంగ్రెస్ తెచ్చిన మార్పు. మహిళలకు 2 బతుకమ్మ చీరలు ఇస్తామని రేవంత్ రెడ్డి మోసం చేశారు. రూ. 15 వేలు రైతుబంధు అన్నారు.. గుండుసున్నా చేశారు. కేసీఆర్ కిట్ కంటే మంచిది ఇస్తామని పేద గర్భిణులను మోసం చేశారు. ఆగస్టులో వేయాల్సిన చేప పిల్లలను, అక్టోబర్‌లో వచ్చినా వేయలేదు. చేప పిల్లల కోసం బడ్జెట్‌లో రూ. 16 కోట్లే పెట్టారని హరీశ్‌రావు గుర్తు చేశారు.

**తెలంగాణలో 8,490 ఎంబీబీఎస్ సీట్లు..**

ఎంబీబీఎస్ చదువును గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చేరువ చేయాలన్న లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్.. ప్రతి జిల్లాకో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుతో గ్రామీణ ప్రాంతానికి చెందిన నిరుపేద బిడ్డలు కూడా ఎంబీబీఎస్ చేసే అవకాశం లభించింది. ఈ నేపథ్యంలో కేసీఆర్ పాలనను కొనియాడుతూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎక్స్ వేదికగా స్పందించారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ రాష్ట్ర వైద్య విద్యకు హబ్‌గా మారిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. మెడికల్ సీట్ల సంఖ్యలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని తెలిపారు. ఒకప్పుడు సామాన్యులకు అందుబాటులో లేని వైద్య విద్య ఇప్పుడు అందుబాటులోకి వచ్చిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణలో కేవలం ఐదు మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండేవి.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆ సంఖ్య 34కి చేరిందని హరీశ్‌రావు గుర్తు చేశారు. 2014 వరకు తెలంగాణలో 2,850 మెడికల్ సీట్లు ఉంటే.. ప్రస్తుతం 8,490 సీట్లు ఉన్నాయన్నారు. కేసీఆర్ ప్రభుత్వ నిర్ణయాల వల్లనే ఇది సాధ్యమైందన్నారు. ఈ ఆల్ టైమ్ రికార్డును ఎవరూ చెరిపేయలేరని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# కిడ్నీ వ్యాధి గ్రస్థులకి శుభవార్త..!

**సిద్దిపేట, శుభ తెలంగాణ :** సిద్దిపేట డయాలసిస్ సెంటర్ కు మరో 5 పడకలు మంజూరుఇప్పటికే 10 పడకలతో సిద్దిపేట లో డయాలసిస్ సేవలు కొత్త 5 పడకలతో మొత్తంగా 15 పడకలతో అందుబాటులో కి రానున్న డయాలసిస్ సేవలు వ్యయ ప్రయాసల నుండి ఉపశమనం. కిడ్నీ వ్యాధి గ్రస్థులు సద్వినియోగం చేసుకోవాలి...మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు.సిద్దిపేట లోని కిడ్నీ వ్యాధి గ్రస్థులకు మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు శుభవార్త చెప్పారు. మరో 5 పడకలు సిద్దిపేట డయాలసిస్ సెంటర్ లో అందుబాటులో కి రానున్నట్లు హరీష్ రావు తెలిపారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ సిద్దిపేట ప్రాంతం లోని కిడ్నీ వ్యాధి గ్రస్తుల వ్యయప్రయాసలు దృష్టిలో పెట్టుకొని హైదరాబాద్ తరవాత సిద్దిపేట లోనే తొలి డయాలసిస్ సెంటర్ ను మంజూరు చేసుకున్నామని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రం లో నగరాలకు పరిమితం అయిన ఈ డయాలసిస్ సెంటర్ తెలంగాణ రాష్ట్రం ఏర్పడినక తొలి డయాలసిస్ సెంటర్ 5 పడకలతో సిద్దిపేట లో ఏర్పాటు చేసుకున్నాం తరవాత రాష్ట్రం లోని అన్ని నియోజకవర్గాల్లో డయాలసిస్ సేవలు అందుబాటులో కి తెచ్చామన్నారు. కిడ్నీ వ్యాధి తో బాధపడుతున్న రోగులు హైద్రబాద్ వెళ్లే పరిస్థితి. కానీ ఆ బాధను గుర్తించి సిద్దిపేట లోనే సెంటర్ ని ఏర్పాటు చేశామని, ఇలాంటి వ్యాధి తో బాధపడుతున్న వారు ఎంతో మంది, లక్షలు ఖర్చు పెట్టిన నయం కానీ వ్యాధి కానీ ఉచితంగా నయం అయ్యే విధంగా ఇది సిద్దిపేట ప్రజలకు ఒక వరమని చెప్పారు. మొదట 5 పడకలతో మొదలైన డయాలసిస్ సెంటర్ ప్రజల అవసరల దృష్ట్యా మరో 5 పడకలు మంజురు కాగా కొత్తగా హరీష్ రావు మరిన్ని విజ్ఞప్తుల మేరకు మరో కొత్తగా 5 పడకలు మంజురు అయ్యాయి. త్వరలోనే సిద్దిపేట డయాలసిస్ సెంటర్ లో



అందుబాటులోకి రానున్నాయ్. కిడ్నీ వ్యాధి గ్రస్తులకు వరం గా మారనుంది. 78వేల 800 కేసులు, తగ్గిన లక్షల ఖర్చులు, వ్యయప్రయసలు సిద్దిపేట నియోజకవర్గం లో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ప్రత్యేక చొరవ తో రాష్ట్రం లోనే తొలి డయాలసిస్ సెంటర్ 2017 లో మొదట 5 పడకలతో ప్రారంభం అయింది. హరీష్ రావు వచ్చిన అనేక విజ్ఞప్తుల దృష్ట్యా 2019 లో మరో 5 పడకలు మంజూరు చేశారు. ప్రస్తుతం వందల మంది డయాలసిస్ సేవలు అందుబాటులో వస్తున్న తరుణం లో గడిచిన ఈ ఏడు సంవత్సరాలలో 78 వేల కేసులు అంటే వ్యాధి గ్రస్థులు రెండు మార్లు మూడు మార్లు చేసుకుకొనే అవకాశం ఈ డయాలసిస్ సెంటర్ లో బాధితులకు చికిత్స అందింది.. ప్రస్తుత తరుణం లో కిడ్నీ వ్యాధి గ్రస్థులు పెరిగారు, మరో వైపు హైదరాబాద్ లాంటి నగరాలకు వెళ్లి చేపించుకొనే ఆర్థిక పరిస్థితి లేకేపోవడం ఎన్నో వ్యయ ప్రయాసలు లోను కావడం తో ప్రజల నుండి అనేక విజ్ఞప్తులు హరీష్ రావు గారి ద్రుష్టి కి రాగ మరో 5 పడకలు కొత్తగా మంజూరు అయ్యాయి. దీనితో సిద్దిపేట డయాలసిస్ సెంటర్ లో మొత్తం 15పడకల తో డయాలసిస్ సెంటర్ అందుబాటులో కి రానుంది ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# ప్రజలకు మరింత చేరువ అయ్యేలా పోలీస్ విధులు ఉండాలి

**రాజన్న సిరిసిల్ల, శుభ తెలంగాణ :** గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ పై,నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలిఎల్లారెడ్డిపేట్ పోలీస్ స్టేషన్ అధికారుల,సిబ్బంది పని తీరు భేష్..ప్రజలకు మరింత చేరువ అయ్యేలా పోలీస్ విధులు ఉండాలని, గ్రామాల్లో విజబుల్ పోలీసింగ్, నేరాల నియంత్రణ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఎల్లారెడ్డిపేట్ సర్కిల్ కార్యాలయం, ఎల్లారెడ్డిపేట్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ ఈరోజు వార్షిక తనిఖీలో భాగంగా ఎల్లారెడ్డిపేట్ సర్కిల్ కార్యాలయం తనిఖీ చేసి సర్కిల్ పరిదిలో నమోదు అవుతున్న గ్రేవ్ కేసులు, అండర్ ఇన్వెస్టిగేషన్ ఉన్న కేసులలో సిడి ఫైల్స్, పెండింగ్ ట్రాయల్లో ఉన్న సిడి ఫైళ్లను పరిశీలించి, కేసులలో నిందితులకు శిక్షలు పడే విధంగా క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని సూచించారు. సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ శాంతి భద్రతల పరిరక్షణకు ఆయాఎస్సై ల ద్వారా చర్యలు చేపట్టాలని, సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ లను తనిఖీ చేయాలని సూచించారు. అనంతరం ఎల్లారెడ్డిపేట్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేసి స్టేషన్ పరిసరాలు, స్టేషన్ రికార్డ్స్ , వర్టికల్స్ అమలు తీరు,స్టేషన్ లో విధులు నిర్వహించే సిబ్బంది కిట్ ఆర్టికల్స్, పెండింగ్లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల సి.డి ఫైల్స్ లను తనిఖీ చేసి స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ. ప్రజలకు మరింత చేరువ అయ్యేలా పోలీస్



విధులు ఉండాలని, పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుల విషయంలో వెంటనే స్పందించి విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నా రు. నేరాల నియంత్రణకై పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలని,విలేజ్ పోలీస్ అధికా రులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని గ్రామాల్లో తరచు పర్యటిస్తూ ప్రజలతో సస్సబంధాలు కలిగి ఉండాలని, గ్రామాలకు సంబంధించిన పూర్తి సమాచారం విపివో ల దగ్గర ఉండాలని ఏదైనా సంఘటనలు జరిగితే వెంటనే ఉన్నత అధికారులకు తెలియజేయాలన్నారు. ఎస్పీ వెంట సిఐ శ్రీనివాస్, ఎస్ఐ రమాకాంత్, ట్రెని ఎస్ఐ రాహుల్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు

# పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి

**భూపాలపల్లి:** పత్తి కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐ డి ఓ సి కార్యాలయపు కాన్ఫరెన్స్ హాల్లో పత్తి కొనుగోలు ప్రక్రియపై మార్కెటింగ్, సహకార, సిసిఐ, పోలీస్,అగ్నిమాపక, వ్యవసాయ కాటన్ మిల్లుల యజమానులతో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పత్తి కొనుగోలు ఏర్పాట్లకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పత్తి కొనుగోలు సీజన్ ప్రారంభం అవుతున్నదని సిసిఐ ద్వారా కొనుగోలు చేయుటకు అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. నవంబర్ మొదటి వారం నుండి పత్తి కొనుగోలు కేంద్రాలకు వస్తుందని తెలిపారు. జిల్లాలో 93 వేల ఎకరాలలో పత్తి సాగు జరిగిందని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పత్తి కొనుగోలు సజావుగా, సక్రమంగా సాగేందుకు ఏర్పాట్లు చేయాలని అన్నారు. జిల్లాలో ఐదు పత్తి మిల్లులు ఉన్నాయని రైతులు విక్రయాలు చేసేందుకు దగ్గరలో ఉన్న మిల్లులకు ట్యాగింగ్ చేయాలని తెలిపారు. కొనుగోలు చేసిన పత్తి నిల్వ ఉంచేందుకు గోదాములను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ నెల 25 వ తేదీ వరకు పత్తి కొనుగోళ్ళు ప్రారంభించాలని ప్రతి రోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు కొనుగోలు జరపాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. సీసీఐ ద్వారా మాయిచ్చర్ మిషన్, సీసీ



కెమెరాలు, బయోమెట్రిక్ ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని పోలీస్ శాఖకు సూచించారు. పత్తి కొనుగోలు కేంద్రాల్లో స్థానిక పోలీస్ అధికారుల నెంబర్లు, అత్యవసర నంబర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. తూనికలు కొలతలు శాఖ ద్వారా ప్రతి కొనుగోలు కేంద్రాలలో కాంటాలకు స్టాంపింగ్ చేయాలని ఆదేశించారు. గోదాములు, మిల్లుల వద్ద అగ్నిపాక శాక ద్వారా అగ్నిప్రమాదాలు జరగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని అన్నారు.

ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి కనక శేఖర్, ఆదనపు ఎస్పీ బోనాల కిషన్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సందాని, వ్యవసాయశాఖ అధికారి విజయ భాస్కర్,జిన్నింగ్ మిల్లుల యజమానులు తదితరులు పాల్గొన్నారు

## వైఎస్ఆర్ ప్రవేశపెట్టిన ఫీజు రియంబర్స్మెంట్ తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు..

**ఆవేదన వ్యక్తం చేస్తున్న ప్రైవేట్ కళాశాల అధ్యాపక బృందం...**

**జమ్మికుంట, శుభ తెలంగాణ :** తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ మరియు పీజీ కళాశాల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక బంద్ 3 వ. రోజు కార్యక్రమంలో జమ్మికుంట పట్టణంలోని ప్రైవేట్ కళాశాలల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ కళాశాల డైరెక్టర్ విజేందర్ రెడ్డి మాట్లాడుతూ పేద, మధ్య తరగతి విద్యార్థుల కోసం వైయస్ రాజశేఖర్ రెడ్డి, ప్రవేశపెట్టిన ఫీజు రీఎంబర్స్మెంట్ పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాలలో నివసిస్తున్న విద్యార్థులు ఫీజు రీఎంబర్స్మెంట్ ఉందని ప్రైవేట్ కళాశాలలో




అడ్మిషన్ పొంది ఫీజు రీయింబర్స్మెంట్ రాకపోవడం వలన తమ యొక్క చదువులను మధ్యలోనే నిలిపి వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్మెంట్ తో విద్యను అందిస్తున్న ప్రైవేటు కళాశాలను ఫీజు రియంబర్స్మెంట్ రాకపోవడం వలన అప్పులపాలై లెక్చరర్ల జీతాలు కూడా ఇవ్వలేని స్థితిలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేసి ప్రైవేట్ కళాశాలలను ఆదుకొని విద్యార్థుల యొక్క ఉన్నత చదువులకు తోడ్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం, అధ్యాపక బృందం, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు...

## యంగ్ ఇండియా స్కూల్‌కు మంత్రి దామోదర రాజనర్సింహ భూమి పూజ



**సంగారెడ్డి :** ఆందోల్ నియోజకవవర్గం బస్వపూర్ లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి మంత్రి దామోదర రాజనర్సింహ భూమియ పూజ చేసారు. మంత్రి మాట్లటాడుతూ తెలంగాణ రావడంలో ఆనాడు కీలక పాత్ర నాదే. సమైక్యాంధ్ర లోనే నేను డిప్యూటీ సీఎంగా ఉన్నాను. అప్పుడూ ఇప్పుడు నేను ఒకేలా ఉన్నాను..ఉంటాను. పదవితో నాకు సంబంధం లేదు...మనిషికి ప్రాంత ప్రీతి ఉండాలి. చేసిన మంచిని ప్రజలు చెప్పుకోరు జనాల్లో ఎంత చేసినా నాకేంటి అనే వైఖరి వచ్చింది. ఆందోల్ లో విద్యాసంస్థలు కావాలని నన్ను ఎవరు అడగలేదు.. అయినా లేని విద్యా సంస్థ అంటూ లేదు. నాడు నియోజకవర్గానికి విద్యాలయాలు తెస్తే నేడు ఆస్పత్రులు తెస్తున్నా. ఎన్నికలు సహజం రాజకీయ నాయకుడు ఏం చేశాడనేది ముఖ్యం. సింగూరు ప్రాజెక్టుని టూరిజం స్పాట్ గా మార్చేందుకు కృషి చేస్తామని అన్నారు.

## హిందూవులు ఏకం కావాలి

**సికింద్రాబాద్, శుభ తెలంగాణ :** దేవాలయాలపై దాడులు జరిగినప్పుడు అన్ని పార్టీలు అన్ని వర్గాల ప్రజలు స్పందించి అండగా నిలవాలని జనసేన తెలంగాణ అధ్యక్షుడు శంకర్ గౌడ్ తెలిపారు. రెండు రోజుల క్రితం దుండగులు దుశ్చర్యకు పాల్పడిన కుమ్మరిగూడ లోని ముత్యాలమ్మ దేవాలయాన్ని శంకర్ జన సేన నేతలతో కలసి సందర్శించారు. మౌన దీక్ష చేస్తున్న స్థానికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల అప్పుడే కాకుండా ఇలాంటి పరిస్థితులలో హిందువులంతా ఏకమై బలంగా నిలబడితే ఇలాంటి సంఘటనలు జరగవని అన్నారు. నిందితుడు సలీంను పూర్తిగా విచారించి అతని వెనుక ఎవరి హస్తముందో, ఉగ్ర కోణం ఉన్నదా, లేఖ రాజకీయ కోణం ఉన్నద అనే విషయాన్ని లోతుగా విచారణ జరపాలని కోరారు. దేవాలయాలపై దాడులు జరగకుండా దేశవ్యాప్తంగా ధర్మరక్షణ బోర్డు ఏర్పాటు చేయాలని జనసేన జాతీయస్థాయిలో పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇలాంటి సంఘటనలపై స్పందించి ఒక ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## అక్రమ సంబంధానికి చిన్నారి బలి

**కుత్బుల్లాపూర్ :** ఓ వివాహిత మీద కన్నేసిన దుర్మార్గుడు తనకు అడొస్తుందనే ఉద్దేశంతో ఏడేళ్ల బాలికను కిరాత కంగా హతమార్చాడు. హైదరాబాద్లోని సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో దసరా రోజు జరిగిన ఈ దారుణం చోటు చేసుకుంది. ఆదిలా బాద్ జిల్లా బేల మండలం పాటగూడ గ్రామానికి చెందిన మిశ్రమ్ ప్రభాకర్ (40) ఏడు నెలల క్రితం హైదరాబాద్ వచ్చాడు. కూలి పనులు చేసుకునే అతను, పాటగూడ గ్రామానికే చెందిన ఇద్దరు కుమార్తె లున్న మహిళతో కలిసి కుత్బుల్లాపూర్ పరిధి సూరారం జీవన్ జ్యోతినగర్ లో ఉంటున్నాడు. ఆమె పెద్ద కుమార్తెకు ఏడేళ్లు. ప్రభాకర్ కు తన ప్రాంతానికే చెందిన తిరుపతితో పరిచయం ఏర్పడింది. ప్రభాకర్ ఇంట్లో తరచూ ఇద్దరూ మద్యం తాగేవారు. ఆ క్రమంలో మహిళపై కన్నేసిన తిరుపతి.. ప్రభాక ర్ తోపాటు ఇద్దరు పిల్లల అడ్డు తొలగించుకుంటే ఆమెను సొంతం చేసుకోవచ్చని పథకం వేశాడని తెలిపారు పోలీసులు. ఈ క్రమంలో ఈ నెల 12న ఉదయం ఆమె పెద్ద కుమార్తెను ద్విచక్ర వాహనంలో తన ఇంటికి తీసు కెళ్లాడు. మధ్యాహ్నం 3 గంటలకు తిరిగి తీసుకొచ్చి వది లేశాడు. సాయంత్రం 5 గంటల సమయంలో ప్రభాకర్ ఇంటి వద్ద ఎవరూ లేని సమయం చూసి బాలికను మళ్లీ తీసుకెళ్లాడు. పొద్దుపోయే వరకూ ద్విచక్రవాహ నంపై తిప్పుతూ.. చీకటిపడ్డాక మేడ్చల్ పోలిస్ స్టేషన్ పరిధి బాసరగడి గ్రామం దగ్గర కత్తితో గొంతు కోసి,కడుపులో పొడిచి చంపే శాడు. బాలిక మరణించినట్లు నిర్ధారించుకున్నాక గోనె సంచిలో మూటకట్టి.. అక్కడికి సమీపంలోని అటవీ ప్రాంతంలో విసిరేశాడు.సూరారం పోలీస్ స్టేషన్ లో బాలిక అదృశ్యమైనట్టు ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యా దుతో పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలించారు. తిరుపతి చిన్నారిని ద్విచక్ర వాహనంలో తీసుకెళ్లినట్లు సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. అప్పట్నుంచి అజ్ఞా తంలో ఉన్న నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. చిన్నారిని హత్య చేసినట్టు నిందితుడు అంగీకరించడంతో, మృత దేహాన్ని స్వాధీనం చేసుకున్నారు పోలీసులు.నిందుతుడు తిరుపతిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించామని,సూరారం పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు మేడ్చల్ ఎసిపి శ్రీనివాస్ రెడ్డి.

## సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు

**పటాన్ చెరు, శుభ తెలంగాణ :** గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలన అందిస్తున్నారని, పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని రహదారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇటీవల 20 కోట్ల 80 లక్షల రూపాయల నిధులు మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసిందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్చెరు అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, మంత్రి దామోదర రాజ నరసింహాలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సంగారెడ్డి జిల్లా పటాన్చెరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో.. నిధులకు సంబంధించిన వివరాలను ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి వెల్లడించారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్చెరు నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి కోసం ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని తెలిపారు. ఇందుకు అనుగుణంగా నూతన రహదారుల నిర్మాణం, బ్రిడ్జిల నిర్మాణానికి 20 కోట్ల 80 లక్షల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. అతి త్వరలో టెండర్లు పూర్తిచేసి పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. నూతన రహదారుల నిర్మాణంతో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

## గురుకులాల విషయంలో డిప్యూటీ సీఎం కీలక ఆదేశాలు

**హైదరాబాద్ :** గురుకుల పాఠశాలల విషయంలో డిప్యూటీ సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇకపై గురుకుల కార్యదర్శి రోజూ ఒక పాఠశాలను పరిశీలించాలని ఆదేశించారు.గురుకుల పాఠశాలలో నాణ్యతతో కూడిన విద్యాబోధన, సౌకర్యాల కల్పన వంటి అంశాలపై ఆ శాఖ కార్యదర్శులతో భట్టి విక్రమార్క సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ. గురుకుల పాఠశాలల భవనాల అద్దె చెల్లింపునకు నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. అద్దె భవనాల యజమానులతో మాట్లాడి అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గురుకుల కార్యదర్శి క్షేత్ర స్థాయి పరిశీలన వివరాలతో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

## గాంధీ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం

**హైదరాబాద్, శుభ తెలంగాణ :** గాంధీభవన్ లో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ఇంచార్జ్ దీపాదాస్ మున్షి కార్యదర్శులు విష్ణునాథ్ విశ్వనాథం, హైదరాబాద్ జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అజారుద్దీన్, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి, సమీరుల్లా, పోటీ చేసిన అభ్యర్థులు, కార్పొరేషన్ చైర్మన్ లు, టీపీసీసీ ఆఫీస్ బేరర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం

# నిర్వహించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు





**అక్టోబర్ , శుభ తెలంగాణ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలం నడిమి గూడెం గ్రామం లో అన్ని శాఖల అధికారులతో గ్రామ పంచాయతీ సమీక్ష సమావేశం నిర్వహించిన్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఈ సందర్బంగా ఆయా శాఖల అధికారులతో ప్రజల సమక్షంలోనే మాట్లాడి ఆయా పంచాయతీ పరిధిలో గల గ్రామలలో నీటి సరఫరా గురుంచి, కరెంటు సమస్యల గురుంచి, ఇరిగేషన్ ఇలా అన్ని సమస్యలను అధికారుల దృష్టిలోకి తెచ్చి వారం లోగ అన్ని సమస్యలు పరిష్కారం చేయాలనీ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అన్ని పథకాలని ప్రతిఒక్కరికి అందేవిధంగా ప్రభుత్వ అధికారులు కృషి చేయాలనీ రానున్న రోజుల్లో యువతకి జాబ్ నోటిఫికేషన్ లు పడతాయాన్ని చదువుకున్న యువత ఆప్లే చేసుకోని మంచి ఉద్యోగాలు సాధించి మీ కుటుంబ్బలకు ఆధార్షంగా నిలవాలని తెలియచేసారు రేషన్ కార్డు బదులుగా ఫ్యామిలీ కార్డు ప్రభుత్వం ఇంటింటికి సర్వే చేసి ప్రతి ఒక్క కుటుంబానికి అందచేస్తుంది అని ప్రతి ఒక్కరు సర్వేలో మీ పూర్తి వివరాలని అధికారులకు అందచేయాలనీ తెలియ చేసిన లిపినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు. ఈ కార్యక్రమం లో అన్ని శాఖల అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతులకు స్వల్ప, దీర్ఘ కాలిక ఋణాలు మంజూరు చేయాలి






**కామారెడ్డి, , శుభ తెలంగాణ** కామారెడ్డి జిల్లా కేంద్రంలో వ్యవసాయ రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకా లిక పంట రుణాలు లక్ష్యానికి అనుగుణంగా, ఎక్కువగా మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం రోజున కలెక్టరేట్ సమావేశ మందిరంలో జూన్ త్రైమాసిక నకు అంతమయ్యే జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని రైతులకు స్వల్ప, దీర్ఘ కాలిక ఋణాలు మరింత ఎక్కువగా మంజూరు చేయాలని అన్నారు. సూక్ష్మ, మధ్య కాలిక ఋణాలు (ఏం.ఎస్.ఏం.ఈ) మంజూరు చేయాలన్నారు. ఇతర ప్రాధాన్యత ఋణాలు అయినటువంటి విద్యా ఋణాలు, ఇంటి ఋణాలు, సామాజిక మౌలిక సదుపాయాల ఋణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. గ్రామీణ, పట్టణ మహిళా సంఘాలకు లక్ష్యానికి అనుగుణంగా ఋణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు సూచించారు. బ్యాంకు లింకేజీ మొండి బకాయిలు ఒక ప్రణాళికా బద్ధంగా సమీక్షించి వసూళ్లు చేయాలని గ్రామీణాభివృద్ధి, పట్టణ( మెప్మా) అధికారులకు సూచించారు. షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల లబ్ధిదారులకు గతంలో సబ్సిడీ మంజూరు అయి బ్యాంక్ ఖాతాలలో జమ అయిన లబ్ధిదారుని యూనిట్లను యుద్ధప్రాతిపదికన గ్రౌండింగ్ చేయాలని తెలిపారు. వివిధ కారణాల వలన దేవునిపల్లి, వాజిద్ నగర్, మిర్జాపూర్, కామారెడ్డి గంజ్ నిజామాబాద్ జిల్లా కో ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ బ్రాంచి లను కామారెడ్డి, బిచ్కుంద, బీర్కూర్, కామారెడ్డి బ్రాంచీలలో విలీనం ప్రక్రియ గురించి సమావేశంలో చర్చించడం జరిగింది. ఈ సమావేశంలో ఆర్.బి. ఐ. అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఏం. జడ్. రెహమాన్, నాబార్డ్ డి.డి.ఏం. ప్రవీణ్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రవికాంత్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, జిల్లా షెడ్యూల్ సంక్షేమ శాఖ అధికారిని రజిత, వివిధ శాఖల అధికారులు, 23 బ్యాంకులకు సంబంధించిన ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దళితులపై దౌర్జన్యం చేసిన పెత్తందారులను తక్షణమే అరెస్టు చేయాలి





**పోలీసుల అత్యుత్సాహం వల్లే దళితులపై మూక దాడులు**
**దళితులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి**
**ఎమ్మెల్యే పక్షపాత ధోరణి విడనాడాలి**
**కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తప్పెట్ల స్కైలాబ్ బాబు,డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్..**

**చిలుకూరు , శుభ తెలంగాణ :** చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలో దసరా పండుగ రోజు కనకదుర్గమ్మ గుడివద్ద ఉత్సవాల సందర్భంగా వీడియో కాల్ మాట్లాడుతున్న దళిత యువకుడిని అపార్థం చేసుకొని ఆ గ్రామానికి చెందిన వట్టికూటి నాగయ్య అనే వ్యక్తి 40 మంది ముకుమ్మడిగా వచ్చి దళితులపై దాడి చేసిన ఘటనలో పెద్దదారులను తక్షణమే అరెస్టు చేయా లని దళితులపై దాడులు చేయడం హేయమైన చర్య అని దళితులపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసి జైలుకు పంపడం దుర్మార్గమని వెంటనే విడుదల చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తప్పెట్ల స్కైలాబ్ బాబు డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ లు అన్నారు బేతావోలు గ్రామంలో దళితులపై జరిగిన దాడి ఘటన సందర్భంగా జరిగిన వివరాలు తెలుసుకునేందుకు కేవీపీ ఎస్ బృందం బుధవారం బేతవోలు గ్రామంలోని దళితవాడను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో జరుగుతున్న కనకదుర్గమ్మ ఉత్సవాల సందర్భంగా తన కుటుంబ సభ్యులతో వీడియో కాల్ మాట్లాడుతున్న దళిత యువకుడిని అపార్థం చేసుకొని ఆ గ్రామంలోని పెత్తందారి ఒట్టికూటి నాగయ్య ను కావాలని ఫోటో తీశాడని దళితులపై రాడ్లు కర్రలతో రాళ్లతో తెగబడి మూక దాడి చేశారని అన్నారు. మహిళలు అనేది కూడా చూడకుండా వారి దుస్తులు చిరిగిపోయే విధంగా దాడి చేయడానికి వచ్చిన వారు వ్యవహరించారని అన్నారు జరుగుతున్న గొడవను ఇరువర్గాలను చెదరగొట్టి ఆపాల్సిన పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించి దళితులపైనే లాటరీలతో పోలీసు జులం ప్రదర్శించి నిందితుల కొమ్ము రాశారని అన్నారు. ఇదంతా ఏమిటని దళితులపై ఎలా దాడులు చేస్తారని ప్రశ్నించిన ప్రతి ఒక్కరిపై పోలీసులు లాఠీచార్జి జరిపిస్తుంది దళితులను తీవ్రంగా కొట్టారని తెలిపారు ఉత్సవాలు తిలకించడానికి వచ్చిన కోదాడ టౌన్ సిఐ తనకు డ్యూటీ తో సంబంధం లేకుండా సివిల్ డ్రెస్ లో దళితులపై దాడికి పాల్పడడం సరికాదని అన్నారు ఇట్టి ఘటనపై పోలీసులు ఏఎస్ఐ దాడి చేశారని కల్పితాలు సృష్టించి దళిత యువకుడు గుండెపంగు వర కుమార్ అతని భార్య రాని తల్లి లక్ష్మీ లను మరియు రెమిడాల వినోద్ నవీన్ లపై అక్రమ కేసులు బరాయించి రాత్రికి రాత్రి అరెస్టు చేసి జైలుకు పంపడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు దళితులు తమపై దాడి చేశారని మమ్మల్ని కులం పేరుతో దూషించి దుర్భాషలాడి అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టిన వారిపై కేసు నమోదు చేయాలని పిటిషన్ ఇవ్వగా కోదాడ రూరల్ సిఐ రజిత రెడ్డి పట్టించుకోకుండా నిందితుల వైపు కొమ్ము కాసారని తెలిపారు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు కింద న సరైన రీతిలో విచారణ చేయకుండా తప్పుడు కేసులు నమోదు చేసిన చిలుకూరు మండల ఎస్సై రాంబాబు మరియు ,కోదాడ రూరల్ సి.ఐ రజిత రెడ్డి ఉద్దేశపూర్వకంగానే దళితులపై దళిత మహిళలపై హత్యయత్నం అనే పెద్ద నేరం మోపి పిర్యాదు చేసిన చిలుకూరు మండల ఏఎస్ఐ వెంకటేశ్వర్లు మరియు డ్యూటీలో లేకుండా దళితుల దళితమహిళలపై దాడిచేసిన కోదాడ పట్టణ సిఐ రాము లను వెంటనే విచారించాలని అన్నారు. దసరా రోజు రాత్రి 12 గంటల సమయంలో ఇచ్చిన పిర్యాదును కాకుండా బెదిరించి వారికి అనుకూలంగా తెల్లావారిన తరువాత మధ్యాహ్నం 2 గంటల సమయంలో రెండవసారి తప్పుడు పిర్యాదు వ్రాయించిన రజీతారెడ్డి మొదటి పిర్యాదునే పరిగణలోనికి తీసుకోని మరల విచారణ చెయ్యాలి తప్ప, పండుగ సందర్భంగా జరిగిన సంఘటనల పైన తప్పుడు కేసులు పెట్టినటువంటి స్థానిక పోలీసు అదికారులపై ప్రతేక విచారణ లేదా ఐజి స్థాయి అధికారితో విచారణ చేయాలని అన్నారు. దళితులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని జైల్లో పెట్టిన దళిత మహిళలను యువకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దళితులపై అక్రమంగా కేసులు పెట్టారని వాటిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ కోదాడ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతి దగ్గరికి దళితులు వెళ్ళగా మా దగ్గరికి ఎవరైతే ముందు వచ్చారో వారి పక్షానే మేము నిలబడతాం తప్ప మీ పక్షాన ఉండలేమని పక్షపాతంగా మాట్లాడడం తగదని ఎమ్మెల్యే పక్షపాత వైఖరి విడనాడాలని అన్నారు. ఇప్పటివరకు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పై కోదాడ డిఎస్పి గ్రామానికి వచ్చి విచారణ చేయకపోవడం వెనకాల ఉన్న ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి అట్రాసిటీ కేసులోని పెత్తందారులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.ఈ ఘటనను రిటైర్డ్ ఐఆర్టిఎస్ అధికారి భరత భూషణ్ గ్రామాన్ని సందర్శించి దళితులతో మాట్లాడి వారిపై దాడి చేయడాన్ని దళితులను జైల్లో పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి, జిల్లా అధ్యక్షులు మద్రి నాగేశ్వరరావు, జిల్లా నాయకులు బొడ్డుపల్లి సురేష్,జంగపల్లి శ్రీనివాస్ గ్రామ దళిత యువకులు,మహిళలు పాల్గొన్నారు.

## నూడ చైర్మన్‌కు ఘన సన్మానం



**నిజామాబాద్ , శుభ తెలంగాణ** నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా నుడ చైర్మన్ కేశ వేణును మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్ నిజాంబాద్ రూరల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉమ్మాజి నరేష్ శాలువాతో సన్మానించి పూల బొకే అందజేశారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి, లోడా చైర్మన్ కేశ వేణు కు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జక్రాన్ పల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సొప్పరీ వినోద్, రూరల్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఉమ్మజి నరేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## ఓదెల మల్లన్న దేవాలయంలో ఉచిత వైద్య శిబిరం

**కరీంనగర్ మెడికవర్ యాజమాన్యానికి కృతజ్ఞతలు**
**మూల ప్రేమ్ సాగర్ రెడ్డి ఆళ్ల సుమన్ రెడ్డి**




**ఓదెల , శుభ తెలంగాణ** కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం పెద్దపెల్లి జిల్లా ఓదెల మల్లిఖార్జున స్వామి దేవాలయ ఆవరణలో దేవాలయ సిబ్బందికి ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించిన.కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి. శిబిరాన్ని ఓదెల కాంగ్రెస్ పార్టీ మండల అద్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి లు ప్రారంభించారు. ఈ శిభిరంలో 150 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, 2డి ఎకో మొదలగు సూపర్ స్పెషాలిటీ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆసుపత్రి డాక్టర్ దీక్షిత్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆలయసిబ్బందికి, స్థానిక ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతోనే ఈ వైద్య శిబిరం నిర్వహించి. అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని ఉచితంగా అందించినందుకు కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు . ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సుధా కర్, సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, ఆలయ ప్రధాన అర్చకులు వీరభద్రయ్య ఆసుపత్రి సిబ్బంది బి. హారీష్, శ్రీనివాస్ ఆలయ అర్చకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తుకారం గేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో

## 80 ఏళ్ల వృద్ధురాలు అదృశ్యం.

**కేసు నమోదు చేసే విచారణ ప్రారంభించిన పోలీసులు...**



**(శుభ తెలంగాణ/సికింద్రాబాద్)** తుకారం గేట్ పోలీస్ స్టేషన్‌లో 80 ఏళ్ల మహిళ అదృశ్యమైన సంఘటనపై కేసు నమోదైంది. కేసు నం. 279/2024 కింద ఎస్ఐ కె. పర్వతాలు ఆధ్వర్యంలో దర్యాప్తు జరుగుతోంది. ఫిర్యాదుదారు బొంగురాల సావిత్రి (30),మహింద్రా హిల్స్ నివాసి, తన తల్లి లక్ష్మమ్మ (80) అక్టోబర్ 4న వెంకటనగర్‌లో కనిపించకుండా పోయిందని అక్టోబర్ 15న ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు వివరాల ప్రకారం,లక్ష్మమ్మ పోతిగంటి గ్రామం నుండి తన మనవడిని చూడటానికి అక్టోబర్ 1న సికింద్రాబాద్‌కి వచ్చింది.అక్టోబర్ 4న సాయంత్రం 6:30 గంటలకు ఫిర్యాదుదారు కుమారుడు యేసు రత్నం ఆమెను వెంకటనగర్‌లోని తన సోదరుడి ఇంటికి వదిలి వెళ్లాడు.అయితే,ఇంటికి తాళం వేసి ఉండటం వల్ల ఆమె అక్కడే ఆగి,తిరిగి రాలేదు.కుటుంబ సభ్యులు అన్ని చోట్ల వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. లక్ష్మమ్మకు మానసిక సమస్యలు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.గతంలో కూడా ఇలాగే ఆమె ఇంటి నుండి వెళ్ళిపోయిన సందర్భాలు ఉన్నాయని,ఈసారి కూడా తల్లి కోసం క్షేమంగా వెతికేందుకు పోలీసులు చర్యలు చేపట్టాలని ఫిర్యాదుదారు కోరారు.

**అదృశ్యమైన మహిళ వివరాలు**

పేరు లక్ష్మమ్మ,వయసు:80 సంవత్సరాలు,ఎత్తు:5 అడుగులు,రంగు:నల్లగా,ధరించిన దుస్తులు:పసుపు చీర,పచ్చ బ్లౌజ్.ఈ గుర్తులతో మహిళ గనుక కనిపించినట్లయితే తుకారం గేట్ పోలీసువారికి సమాచారం ఇవ్వాలని విచారణ అధికారి ఎస్సై పర్వతాలు పేర్కొన్నారు.

## ప్రతి పేదింటికి ఇందిరమ్మ ఇండ్లు

**మాట ఇచ్చాం మాట నిలబెట్టుకుంటాం**
**ఇందిరమ్మ కమిటీలు నిరుపేదలకు వరం**
**కాంగ్రెస్ పార్టీ కూసుమంచి మండల సీనియర్ నాయకులు వనం మధుసూదన్ రావు**

**ఖమ్మం , శుభ తెలంగాణ** ఇందిరమ్మ గ్రామ కమిటీలు నిరుపేద లకు వరమని కాంగ్రెస్ పార్టీ కుసుమంచి మండలం సీనియర్ నాయకులు వనం మధు సూదన్ రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం వెలుగు నిఘా ప్రతినిధితో మాట్లాడుతూ తెలం గాణ రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశానుసారం రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణం మరియు సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహకారం తో ఇందిరమ్మ గ్రామ కమిటీలు ఏర్పాటు చేసుకోవడం జరుగుతుంద న్నారు.

# చేపలు తిన్న తర్వాత పాల పదార్థాలు తినకూడదా..?





మాములుగా మనం కొన్ని రకాల ఆహార పదార్థాలు తిన్న తర్వాత కొన్నింటిని తినకూడదని చెబుతూ ఉంటారు. అటువంటి వాటిలో చేపలు, అలాగే మాంసం తిన్న తర్వాత పాలు లేదా పాల పదార్థాలు తినడం అన్నది కూడా ఒక్కటి. పాలు తాగిన వెంటనే చేపలు తినటం వలన ప్రయోజనం ఇవ్వటానికి బదులుగా ఒక పాయిజన్ లాగా పని చేస్తుందని మన పెద్దలు చెబుతూ ఉంటారు చేపలు అసిడిక్ స్వభావాన్ని కలిగి ఉంటాయి. పాలు ఆల్కలైన్ స్వభావాన్ని కలిగి ఉంటాయి. ఈ క్రమంలో రెండింటినీ కలిపి తీసుకుంటే గ్యాస్టిక్ సమస్యలు వస్తాయి. కాబట్టి ఈ రెండిటిని కలిపి తీసుకోకపోవటమే మంచిదని చెబుతున్నారు. చర్మపు మచ్చలకు పాలు లేదా చేపలతో సంబంధం లేదట. ఇది ఆటో యూనియన్ వ్యాధి అంటే రోగనిరోధక వ్యవస్థ మెలీనియంతో పోరాడే ప్రతి రోధకాలను ఉత్పత్తి చేస్తుందట. యాంటీబాడీలు దాడి చేసిన చోటల్లా చర్మంపై మచ్చలు కనిపిస్తాయట. అంతేకానీ చేపలను పాలతో కలిపి తీసుకుంటే చర్మంపై మచ్చలు రావని వైద్యులు చెబుతున్నారు. చేపలు, పాల ఉత్పత్తులలో అధిక ప్రోటీన్లు ఉంటాయట. రెండింటిని కలిపి తీసుకుంటే జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పట్టవచ్చుట. దీనివల్ల గ్యాస్, డయేరియా తదితరులు సమస్యలు వస్తాయేమో కానీ చర్మానికి సంబంధించిన మచ్చలు లాంటివి రావని చెబుతున్నారు. కొన్ని కొన్ని ఆహార పదార్థాల మిశ్రమం కొందరి శరీరానికి పడదు ఎలర్జీలకి దారితీస్తుంది. అది ఆయా శరీరతత్వాల మీద ఆధారపడి ఉంటుందని, అంతే తప్పితే ఈ కాంబినేషన్లో తింటే చర్మ సమస్యలు వస్తాయని, చనిపోతాము అనేది మాత్రం పెద్ద అపోహ మాత్రమే అని వైద్యనిపుణులు చెబుతున్నారు. కాబట్టి చేపలు తిన్న తర్వాత పాలు తాగడం లేదంటే పాల పదార్థాలు తిన్న తర్వాత చేపలు తినడం లాంటివి చేయకూడదని చెబుతున్నారు. ఈ రెండు కాంబినేషన్ ఒకేసారి తింటే జీర్ణ సమస్యలు తలెత్తుతాయుట.

# మిరపకాయను కాడతో మేలు జరుగుతుందా?



పచ్చిమిర్చి ఆహారాన్ని కారంగా, రుచిగా చేస్తుంది. ఇది మాత్రమే కాదు పచ్చి మిరపకాయలను రోజూ తినడం వల్ల మన ఆరోగ్యానికి కూడా చాలా ప్రయోజనాలు ఉన్నాయి. పచ్చి మిర్చిలో విటమిన్ సి, ఎ, ఐరన్ ఉంటాయి. శరీరానికి అవసరమైన భాస్వరం, రాగి వంటి మూలకాలు మిర్చిలో కూడా ఉంటాయి. పచ్చి మిర్చిలో క్యాప్సైసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది గుండె జబ్బులను నివారిస్తుంది. క్యాప్సైసిన్ మూలకం మిరపకాయలకు కారంగా కూడా జోడిస్తుంది. అంతే కాకుండా పచ్చిమిర్చి తినడం వల్ల జీర్ణశక్తికి, కంటి చూపుకి, రోగనిరోధక శక్తికి మేలు జరుగుతుంది. కాడతో పాటు మిరపకాయలను తినాలని నిపుణులు ప్రజలకు సలహా ఇస్తున్నారు. ఇలా మిరపకాయ తినడం వల్ల పేగు ఆరోగ్యం మెరుగుపడుతుందని చెబుతున్నారు. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రచురించబడిన ఒక నివేదిక ప్రకారం.. ఈ హ్యాక్‌పై వివిధ నిపుణులు భిన్నమైన అభిప్రాయాలను కలిగి ఉన్నారు. ఒక నిపుణుడు మిరపకాయ కారంగా లేదా దాని కాడ ఉన్నదా లేదా కడుపుకి ఎటువంటి ప్రాముఖ్యత లేదని చెబుతున్నారు. ఇది పూర్తిగా మిరప ఎలా సాగు చేయబడింది..? ఎలా పండింది అనే దానిపై ఆధారపడి ఉంటుందన్నారు. పచ్చి మిరపకాయ కడుపు, ప్రకోప ప్రేగు సిండ్రోమ్‌లో కూడా ప్రయోజనకరంగా ఉంటుందని మరో నిపుణుడు చెప్పారు. పచ్చి మిరపకాయలు పేగులకు కూడా మేలు చేస్తాయి. కానీ వేసవిలో వీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల గ్యాస్ సమస్యలు వస్తాయి. వేసవిలో పచ్చిమిర్చి ఎక్కువగా తీసుకోవడం వల్ల డీహైడ్రేషన్‌కు గురవుతారని తెలిపారు. కొన్ని మిరపకాయల కాడలు కారంగా ఉంటాయి. కాబట్టి కారంగా ఉండే ఆహారాన్ని ఇష్టపడని వారు కాడలను తినకూడదని మరో డైటీషియన్ అంటున్నారు. మిర్చి కాడ చేదుగా ఉండడం వల్ల ఆహార రుచి పాడు అవుతుందని కూడా కొందరు నిపుణులు చెబుతున్నారు. బెంగుళూరుకు చెందిన ఓ డైటీషియన్ మాట్లాడుతూ.. మిరపకాయను తయారు చేసే విధానం, కారం రకం కూడా జీర్ణ ప్రభావాన్ని నిర్ణయిస్తుందన్నారు. మిరపకాయలను ఉడికించడం వల్ల క్యాప్సైసిన్‌లో కొంత భాగాన్ని తగ్గించవచ్చని చెబుతున్నారు. అయితే కొన్ని మిరప రకాలు కూడా సహజంగా తక్కువ క్యాప్సైసిన్ కలిగి ఉంటాయి. ఇది జీర్ణవ్యవస్థపై తక్కువ ప్రభావాన్ని చూపుతుందని పేర్కొన్నారు.


# మాంసం ఎక్కువగా తింటున్నారా?

మనలో చాలామందికి ముక్క లేనిదే ముద్ద కూడా దిగదు. వారంలో కనీసం నాలుగైదు సార్లు అయినా మాంసం తింటూ ఉంటారు. మరికొందరు రోజు మాంసం తింటూ ఉంటారు. అయితే మాంసం తినడం ఆరోగ్యానికి మంచిదే కానీ అలా అని ఎక్కువగా ఉంటే మాత్రం సమస్యలు తప్పవట. అయితే మాంసాహారం తింటే కొన్ని రకాల సమస్యలు వస్తాయి అంటున్నారు ఆరోగ్య నిపుణులు. మరి మాంసం తింటే ఎలాంటి సమస్యలు వస్తాయో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. నిజానికి మాంసాహారం తినడం వల్ల శరీరానికి చాలా పోషకాలు లభిస్తాయట. ఇందులో ఉండే కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు, విటమిన్ లు రోగ నిరోధక వ్యవస్థని బలపరుస్తాయని చెబుతున్నారు. అలానే అతిగా మాంసాహారం తినడం వల్ల శరీరం వ్యాధులకి నిలయంగా మారుతుందని చెబుతున్నారు. మాంసాహారం వల్లే ఎక్కువ మందికి క్యాన్సర్, గుండె జబ్బులు వస్తున్నాయని పలు పరిశోధనల్లో వెల్లడైనట్లు. అలాగే మాంసాహారం ఎక్కువగా తినే వారి శరీరంలో కొలెస్ట్రాల్ విపరీతంగా పెరుగుతోందట. కొలెస్ట్రాల్ పెరిగింది అంటే గుండె జబ్బుకి అతి సమీపంలో ఉన్నారని అర్థం అని చెబుతున్నారు. అలాగే మాంసాహారాన్ని ప్రతిరోజు తీసుకున్నవారు. బరువు త్వరగా పెరుగుతారని డాక్టర్లు ఎప్పటినుంచో చెపుతున్న వాస్తవం. అలాంటి వాళ్ళు ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవడం వలన మాంసాహారం తినడం వల్ల వచ్చే పోషకాలు లభిస్తాయట. అదే సమయంలో బరువుని కూడా తగ్గిస్తాయని చెబుతున్నారు. అలాగే మాంసం తీసుకోవడం వల్ల కొన్నిసార్లు పేగుల పనితీరుపై చెడు ప్రభావం చూపిస్తుందట. ప్రాసెస్ చేసిన మాంసం చాలా ప్రమాదం



దీనివల్ల ఆ పొట్టకు సంబంధించిన అనేక వ్యాధులు మనల్ని పట్టిపీడిస్తాయని హెచ్చరిస్తున్నారు. అలాగే ఎక్కువ మాంసాహారం తింటే ఎక్కువ కార్బోహైడ్రేట్లు ఉన్నట్లే దీనివలన మలబద్ధకం వస్తుందట. ఎందుకంటే మాంసంలో కరిగే ఫైబర్ ఉండదు. కాబట్టి జీర్ణవ్యవస్థ కదలకుండా మలబద్ధకానికి కారణం అవుతుంది. కాబట్టి మాంసాహారాన్ని తీసుకోవద్దు అనట్లేదు కానీ పరిమితిలో మాత్రమే తీసుకోమని సలహా ఇస్తున్నారు ఆరోగ్య నిపుణులు.

# బీపీ సమస్యతో ఇబ్బంది పడుతున్నారా!



ప్రస్తుత రోజుల్లో చాలామంది లో బీపీ అలాగే హై బీపీ సమస్యలతో బాధపడుతున్న విషయం తెలిసిందే. చిన్న పెద్ద అని వయసుతో తేడా లేకుండా చాలామందిబీపీ సమస్యతో బాధపడుతున్నారు. ఇక ఈ బీపీని కంట్రోల్ లో ఉంచుకోవడం కోసం ఎక్కువ శాతం టాబ్లెట్లను ఉపయోగిస్తూ ఉంటారు. ఇంకొందరు రకరకాల ఆహార పదార్థాలు తింటూ బిపిని కంట్రోల్ లో ఉంచుకుంటూ ఉంటారు. అయితే వెల్లుల్లి ఉపయోగించి కూడా బీపీని కంట్రోల్ లో ఉంచుకోవచ్చు అని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అది ఎలాగో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. వెల్లుల్లి లో అల్లిసిన్, డయాలిల్ డై సల్ఫైడ్, డయాలిల్ ట్రై సల్ఫయిడ్, సల్ఫర్ సమ్మేళనాలు, ఖనిజాలు వంటివి ఉంటాయి. అలాగే విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. ఇందులోని అల్లిసిన్ బ్లడ్ ప్రెషర్ ని నియంత్రించడంలో ఎక్కువగా ఉపయోగపడుతుందట. పచ్చి వెల్లుల్లి ముక్కలుగా కోసినప్పుడు లేదా తినడం ద్వారా అలీనాజ్ విడుదలవుతుందట. ఇది చెడు కొలెస్ట్రాల్ ని తగ్గిస్తుందని చెబుతున్నారు. అలాగే ప్రతీ రోజు రోజు రెండు వెల్లుల్లి రెబ్బలను తినడం వల్ల అనేక సమస్యల నుంచి దూరంగా ఉండవచ్చని చెబుతున్నారు. వెల్లుల్లి కూరల్లో, టీ లో కూడా ఉపయోగించుకోవచ్చుట. సలాడ్స్ లో తరిగిన వెల్లుల్లిని ఉపయోగించుకోవచ్చని చెబుతున్నారు. దీనివలన అదనపు రుచి యాడ్ అవటంతో పాటుగా ఆరోగ్యానికి కూడా ఉపయోగపడుతుందని చెబుతున్నారు. సలాడ్స్ కోసం ప్రత్యేకంగా సాల్టెడ్ వెల్లుల్లి అందుబాటులో ఉంటుందట. అంతేకాకుండా పులియపెట్టిన వెల్లుల్లిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల బీపీ తో పాటు ఇతర సమస్యల నుంచి దూరంగా ఉండవచ్చని చెబుతున్నారు. వెల్లుల్లి టీ తాగడం ద్వారా కూడా బీపీకి చెక్ పెట్టవచ్చుట. అలాగే వెల్లుల్లి పొడి చేసుకొని ఆహారంలో చేర్చుకోవడం ద్వారా కూడా బీపీని కంట్రోల్ లో పెట్టుకోవచ్చుట. అయితే బీపీ తో పాటు ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడేవారు వెల్లుల్లి తీసుకునే ముందు వైద్యుల సలహా తీసుకోవడం మంచిదని చెబుతున్నారు.

# మధుమేహానికి మ్యాజిక్ లాంటి మందు!



మధుమేహం ఉన్నప్పుడు, రక్తంలో గ్లూకోజ్ గాఢత ఎక్కువగా ఉంటుంది. ఇది శరీరంలోని వివిధ భాగాలలో వివిధ రకాల సమస్యలను కలిగిస్తుంది. మధుమేహం నియంత్రణకు క్రమం తప్పకుండా మందులు తీసుకోవడం తప్పనిసరి. అయితే కొన్ని హెూం రెమెడీస్‌ని అనుసరించడం ద్వారా మీరు రోజువారీ మధుమేహం మందుల సమస్య నుండి బయటపడవచ్చునని నిపుణులు చెబుతున్నారు. రోజూ మజ్జిగ తీసుకుంటే మధుమేహం అదుపులో ఉంటుంది. ప్రతి రోజూ ఒక గ్లాసు మజ్జిగ తాగడం వల్ల రక్తంలో చక్కెరను తగ్గించడంలో చాలా ముఖ్యమైన ఔషధంగా పనిచేస్తుంది. అయితే, మీరు సాధారణ మజ్జిగ తినడానికి బదులుగా అందులో ఒక చెంచా చియా గింజలను కలిపితే, అది రక్తంలో చక్కెరను రెండు రెట్లు వేగంగా నార్మల్ స్థితికి తీసుకువస్తుంది. చియా విత్తనాలు ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరుస్తాయి. ఇది భోజనం తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరీకరించడంలో సహాయపడుతుంది. మజ్జిగలో నానబెట్టిన చియా గింజలు బాగా పనిచేస్తాయి. చియా గింజల వినియోగం మధుమేహాన్ని నియంత్రించడంలో సహాయపడుతుందని అధ్యయనాలు కూడా నిరూపించాయి. చియా సీడ్స్‌లో యాంటీ ఆక్సిడెంట్లు, మినరల్స్, ఫైబర్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్‌లు పుష్కలంగా ఉంటాయి. టైప్ 2 డయాబెటిస్ కారణంగా ఎదురయ్యే సమస్యల్ని చియా సీడ్స్ తగ్గిస్తాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయి. మధుమేహాన్ని శాశ్వతంగా నియంత్రణలో ఉంచుతాయి. హెల్తీ డైట్‌తో పాటు చియా సీడ్స్ తీసుకుంటే చెడు కొలెస్ట్రాల్, స్థూలకాయం తగ్గుతుంది. ఎప్పుడైతే కొలెస్ట్రాల్, స్థూలకాయం తగ్గుతాయో మధుమేహం ముప్పు కూడా తగ్గిపోతుంది. ఇందులో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు రక్తంలో చక్కెర శాతాన్ని తగ్గించడంలో దోహదం చేస్తాయి.

Edited, Printed, Published & Owned by Sri N.Chandra Shekhar, Printed at Laxmi Printers, D.No: 1-1-149/A, Gandhi Nagar, Kapra Mandal, Ecil, Medchal District. Telangana. Corporate Office : RamaKrishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India. Website: www.subhatelangana.in Gmail : subhatelangana@gmail.com Cell : 7799911110